స్త్రీపునర్వివాహ శాస్త్రసంగ్రహము

By

K. VEERESA LINGAM

స్త్రీపునర్వివాహ శాస్త్రసంగ్రహము

20-1-1882

ఉపోద్ఘాతము.

సువివేకులారా !

ఇప్పు డిక్కడ స్త్రీపునర్వివాహవిషయకమయిన చర్చ విశేషముగా జరుగుచున్నందున సత్యమును తెలిసికొనుటయం దిష్టముగల వారి యుపయోగమునిమిత్తమయి యీ విషయమునఁ గల శాస్త్రసంబంధమయిన సాధక బాధకములను పూర్ణముగా తెలుపవలసి యేయున్నను, అట్టిపని చేయుట కిప్పు డవకాశము చాలదు గనుక సంగ్రహముగా నేనీ యుపన్యాసమును జేయుచున్నాను. మన దేశములో స్త్రీపునర్వివాహ మాచారములో లేకపోవుటవలన బాలవితంతువులలో సాధారణముగా నడుచుచున్న హేయమయిన వ్యభిచారమును, కామోద్రేకముచేత జాతిగుణవివేచనము లేక వితంతువులు పరపురుషులతోఁ జేయు జారత్వమును, మానవంతులగు బంధువుల కంటఁ బడ్డప్పుడు కోపావేశముచేత ననివార్యముగా సంభవించు నరహత్యలు మొదలగు ఘోరకృత్యములును, వ్యభిచారమును మరగిన వితంతువులు ఉపపతుల నిమిత్తమునఁ జేయు దుర్వ్యయములును, అట్టి యనాథయువతులు తమకు తోడుగా నుండుటకయి మగఁడుగల భార్యలనుగూడ వ్యభిచారమునకు దింపఁగా వారిభర్తలు మొదలయిన వారికిఁ గలిగెడి యవమానమనఃఖేదములును, ఇంటఁగల నిర్బంధములకు తాళఁజాలక కామప్రేరణచేత వీధి కెక్కి నీచులగు విటపురుషులతోడ బాలవితంతువులు లేచిపోయినప్పుడు బంధువర్గమునకుఁ గలుగు తలవంపు

లును, వితంతువుల వ్యభిచారమునకు ఫలముగా గర్భము నిలిచి నప్పుడు జరపఁబడు గర్భస్రావములు, భ్రూణహత్యలు, శిశుహత్యలు మొదలగు దారుణకృత్యములును అనేకములు కలవు. అట్టి క్రూరకృత్యములు రాజకీయాధికారులకుఁ దెలిసి వానితో సంబంధించినవారినెల్ల రచ్చ కీడ్చినప్పుడు నిర్దోషులకు సహితము ప్రాప్తములగు శిక్షలును, మానభంగములును, ముసలివాండ్రుసహిత మిరువురను మువ్వురను బాలికలనే వివాహమాడుచుండుటవలనను, బాల్యముననే భర్తలను పోగొట్టు కొన్న చిన్నకన్నియలు సహితము వివాహమున కక్కఱకురాక వ్యర్థ రాండ్రగుచుండుటవలనను కన్నియలకు కఱవువచ్చి, ధనపిశాచ గ్రస్తులైన జనకులు నరమాంసవిక్రయమునకు వెఱవక వందలకొలఁది రూప్యములను స్వీకరించి తమ ముద్దుకూతులను వృద్ధవిగ్రహములకు వివాహవ్యాజమున బలి పెట్టుచుండుటచే ప్రబలుచుండు కన్యాశుల్కమును, వ్యభిచరించి శిశువులను చంప చేతులాడక కులమువారికి వెఱచి దయార్ద్రహృదయముగల బాలవితంతువులు వారిని విజనప్రదేశమునఁ బాఱవేయఁగా మాలమాదిగలు వారి నెత్తి పెంచి బ్రాహ్మణాద్యుత్తమవంశసంభవులయిన యా బాలకులను పరమ నీచములయిన పనులయందు నియోగించినప్పుడు చూడెడి జననీప్రభృతులకు గలిగెడు మనఃపరితాపమును, వివాహమనఁగా నెట్టిదో యెఱుఁగని యజ్ఞానదశ యందే పతులు పరలోకగతులుకాఁగా శోకసముద్రమున మునిఁగి పెద్దపెట్టున నేడ్చుచుండు జననీజనకులచెంతకుఁ బోయి పసిబాలికలు దుఃఖకారణమును దెలిసికోలేక యెఱుఁగని ప్రశ్నలు వేయునప్పుడు తల్లిదండ్రులకు మాత్రమేకాక కన్నవారికిని విన్నవారికినిఁగూడ గలిగెడి గుండెలవిసెడి సంతాపమును, చెడునడతలు ప్రవేశింప సాధ్వులు సహితము త్రోడి పడఁతులు కని పెంచుచున్నప్పుడును, సరివారు ముద్దు

లను ముచ్చటలను ననుభవించు చున్నప్పుడును, వృద్ధులగు తల్లిదం
డ్రులు కూడ గదులలో పట్టెమంచములమీఁద రాత్రులు సుఖముగా
శయనించుచుండఁగా తా మొంటిగా గుమ్మములవద్దను పంచను జేరి,
కటికినేలను బరుండి, వా రనుభవించు సుఖమును తమ దురవస్థను తలం
చుకొాను నప్పుడును పొందు వ్యాకులభావమును, తమ కడుపునఁ బుట్టిన
బాలికలు పసితనములోనే విధవలయి తిన్నని బట్టయు కడుపునిండ
రెండుపూటలు తిన్నంత యన్నము నైన నెఱుఁగక తలలు గొఱిగించు
కొని వికారపురాండ్రయి యింటిపని యంతయుఁ జేయుచుండియు నెల్ల
వారిచే రోతమాటలు పడుచు నెడతెగని దుఃఖము ననుభవించుచుం
డఁగా చూడలేక శోకించు తల్లిదండ్రుల మనోవేదనయు, ఇటువంటివే
యనంతము లయిన యితర దుఃఖ విషయములును, ప్రతిదినమును ప్రత్య
క్షమునఁ గనఁబడినప్పుడు దయ యెట్టిదో యెఱుఁగని కిరాతునివంటి
వానికి సహితము మనసు కరఁగి యీ దురాచారమును మాన్పింప
వలె నని పలుమాఱు మనసులో నూహ పుట్టియు దుర్లంఘ్యము
లయిన శ్రుతిస్మృతులేమో యీ విషయమున క్రౌర్యమును వహించు
చున్న వని యాచారపిశాచ ప్రేరణమున నొక భ్రమ పొంది, నిరాశను
జెంది యూరకుండవలసిన గతి సంభవింపక మానదు. కాఁబట్టి తాము
చేసెడి యెల్లపనులను శాస్త్రానుగుణ్యముగానే నడపవలయు నను నియ
మము గల హిందువులను పూర్వాచారమునుండి మరలించుట కయి
శాస్త్రప్రమాణములు మాత్రమే కావలసి యుండును గాని యుక్తు
లును, లోకనిదర్శనములును నావశ్యకములు కావు. ఇట్టి విషయముల
యం దొక సిద్ధాంతము నేర్పఱుచుకొనుటకు ప్రమాణములు కొందఱు
శ్రుతి స్మృతి పురాణము లనియు కొందఱు శ్రుతి స్మృతి శిష్టాచారము
లనియు నిర్ణయించి యున్నారు.

శ్లో. య దదృష్టం హి వేదేషు త ద్ద్రష్టవ్యం స్మృతౌ కిల
ఉభాభ్యాం య దదృష్టస్తు త త్పురాణేషు పఠ్యతే.

వేదములయం దేది కనఁబడదో యది స్మృతులయందుఁ జూడఁ బడఁ దగిన దనియు, ఆ రెంటియందును కనఁబడనిది పురాణముల యందుఁ జెప్పఁబడు ననియు, ఆపస్తంబస్మృతి యందును,—

శ్లో. ధర్మం జిజ్ఞాసమానానాం ప్రమాణం ప్రథమం శ్రుతిః
ద్వితీయం ధర్మశాస్త్రం తు తృతీయో లోకసంగ్రహః.

ధర్మజిజ్ఞాసముఁ జేయు వారికి మొదటి ప్రమాణము శ్రుతి యనియు, రెండవ ప్రమాణము స్మృతి యనియు, మూడవ ప్రమాణము లోకాచార మనియు భారతానుశాసనిక పర్వమునందును జెప్పఁబడి యున్నది. పురాణాచారముల విషయ మయి భిన్నాభిప్రాయము కలిగి యున్నను, శ్రుతిస్మృతులు పరమప్రమాణము లనుటమాత్రము నిర్వివాదాంశము.

శ్లో. శ్రుతిస్మృతిపురాణేషు విరుద్ధేషు పరస్పరం
పూర్వం పూర్వం బలీయం స్యా దితి న్యాయవిదో విదుః.

శ్రుతిస్మృతి పురాణములలో పరస్పరవిరోధము సంభవించి నప్పుడు పురాణమునకంటె స్మృతియు, స్మృతికంటె శ్రుతియు బలీయ ములని యాపస్తంబుఁడు చెప్పి యున్నాఁడు. శ్రుతులలోఁ గాని, స్మృతులలోఁ గాని విరోధవచనములు కనఁబడినప్పు డవి యన్నియు సమన్వయించున ట్లర్థము చేయవలయుననియు, అవి యేవిధముచేతను సమన్వయించనప్పుడు ధర్మము వికల్పముగాఁ జెల్లు ననియు, వేదార్థ మును వ్యాకరణాది షడంగముల ననుసరించియే చేయవలయు ననియు, స్మృతులలో చతుర్యుగసాధారణ స్మృతులకంటె నా యా యుగస్మృతు

లాయా యుగములయందు బలవత్తరము లనియు, పదముల కర్థమును జేయునప్పుడు విశేషబాధకము వచ్చినప్పుడు తప్ప యౌగికార్థమును గ్రహింపఁ గూడదనియు, నిఘంటువులయందుఁ గనుపట్టు రూఢార్థమునే గ్రహింపవలయుననియు, శాస్త్రములయందలి పారిభాషికములయిన పదములను పారిభాషికములయిన యర్థములయందే గ్రహింపవలె ననియు, విశేషవిధులున్న స్థలములయందు సామాన్యవిధులు ప్రవర్తింపవనియు, వ్యాఖ్యానము లెప్పుడును స్వతంత్రప్రమాణములు కావనియు, మన పూర్వులు నియమములు చేసియున్నారు. ఈ నియమములలోనే వరుసగా స్త్రీపునర్వివాహమునకు సాధకబాధకములుగా నుండు శ్రుతిస్మృతిపురాణవచనముల నుదహరించుచు, వానియర్థ నిర్ణయమును జేయుటకుఁ బ్రయత్నించెదను.

శ్రుతి ప్రమాణములు.

మొట్టమొదట శ్రుతి ప్రమాణములను గూర్చి విచారింతము. ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము, అధర్వవేదము అని శ్రుతి నాలుగుభాగములు గలది.

౧. ఉదీర్ష్వ నా ర్యభి జీవలోక మితాసు మేత ముపశేష ఏహి
హ స్తగ్రాభస్య దిధిషో స్త్వ మేతత్పత్యు ర్జనిత్వ మభిసంబభూవ.

ఓ నారీ! చచ్చియున్న యీ పెనిమిటియొద్ద పడియున్నావు; బ్రతికియున్నవారిని జూచి లేచిరా; పాణిగ్రాహకుఁడును వితంతువును వివాహమాడ నిచ్ఛగలవాఁడుచు నగుభర్తకు భార్యవు కమ్ము. అని యీ శ్రుత్యర్థము.

ఈ శ్రుతి యజుర్వేద తైత్తిరీయారణ్యకములోని యాఱవ ప్రపాఠకమునందలి పదునాలవ యనువాకము. ఇది వేదమునందు మృత్యుఁడ

యిన యాహితాగ్ని బ్రాహ్మణుని భార్యను గూర్చి చెప్పఁబడిన వాక్యము. 'ఇయం నారీ' యను మంత్రప్రకారముగా మృతభర్తృక పెనిమిటి శవమునొద్ద పడియుండఁగా బంధువు లీ మంత్రమును జెప్పి యామెను లేవఁదీసికొని వత్తురు. సంతానమున్నను, లేకపోయినను, ఆహితాగ్ని బ్రాహ్మణుని భార్యవంటిదానికే వేదము పునర్వివాహమును విధించు చున్నప్పుడు బాల వితంతువులకు వివాహము విధించు ననుట నిరాక్షే పము కాదా ? పితృమేధమునందలి యీ మంత్రమును సహగమనము చేయని స్త్రీలయొద్దనే చదివి లేవఁదీయవలెనని విధులు గలవు. కల్ప సూత్రములలో నొకటగు భారద్వాజ సూత్రము "తాం పతీత్థ ఏకథనే నోత్థాపయ త్యన్యో వా బ్రాహ్మణ ఉదీర్ష్వనారీతి" యని మృతభర్తృ కను మఱఁదిగాని మఱియొక బ్రాహ్మణుఁడుగాని లేవఁదీయవలయు నని విధించుచున్నది. "తాం ప్రతిగతః సవ్యేపాణా వభిపాదోత్థాపయతి" యని విద్యారణ్యులవారు భాష్యమునం దుదాహరించిన కల్పసూత్రము కుడిచేతితో పట్టుకొని లేవ నెత్తవలయు నని యొకవిశేషమును గూడ జెప్పుచున్నది.

ఈ శ్రుతియొక్క యర్థము స్త్రీ పునర్వివాహపక్షమున స్పష్టము గానే యున్నను, ఈ విషయమును మఱింత బలపఱుచుట కయి దీని పూర్వశ్రుతిని గూడ నిందుదాహరించుచున్నాను.

౨. ఇయం నారీ పతిలోకం వృణానా నిపద్యత ఉప త్వా మర్త్య ప్రేతం విశ్వం పురాణ మనుపాలయంతీ తస్యై ప్రజాం ద్రవిణం దేహ దేహి. యజుర్వేదము.

ఓ మృతుఁడా ! నీభార్య నీలోకమును గోరుచు ప్రేతవగు నీయొద్ద పడియున్నది; ప్రాచీన మగు పాతివ్రత్యధర్మము ననుసరించి వర్తించు చున్నది; ఈలోకమున నీమెకొఱకు సంతానమును ధనమును కలుగు

నట్లు చేయుము—అని పై శ్రుతి కర్థము. "అత్ర పత్నీ ముపనిపాతయ తీ యం నారీతి" యను కల్పసూత్రమునుబట్టి భార్యను చచ్చిన భర్త సమీపమున పరుండబెట్టి, బంధువులు ప్రేతము నుద్దేశించి యీమంత్ర మును పఠింతురు. బంధువులు ప్రేతపత్నికొఱకు (పునర్వివాహమువలన) సంతానాదికము కలుగున ట్లనుగ్రహింపవలయునని ప్రేతమును గోరు టయు పునర్వివాహము చేసికొనఁగోరువానికి భార్యవుకమ్మని ప్రేతపత్నిని గోరుటయు చూడఁగా స్త్రీపునర్వివాహము వేదవిహిత మనుట కరతలామలక మగుచున్నది. సూత్రకారు లందఱును ఐకకంఠ్యముతో పూర్వోక్తమంత్రద్వయమును పఠింపవలసినవారు మఱఁది మొదలగు బంధువులే యని విధించుటవలన, కర్మచేయవలసిన పుత్రులను వదలి పెట్టి తదితరులను నియమించుటచూడ పుత్రసంతానము లేనివారి విష యముననే యీ రెండుమంత్రములు వినియోగపడవలసిన ట్టూహింప దగియున్నది. అందుచేతనే పితృమేధానుక్రమణికయందు "ఏతన్మంత్ర ద్వయం సపుత్రకాయా నాస్తి" యను వాక్యము కనబడుచున్నది. దీనినిబట్టి విచారింపఁగా వేదము సంతానవతులుగూడ పునర్వివా హము చేసుకోవచ్చునని చెప్పుచున్నను, సూత్రకారులు మాత్రము సంతానములేని కాంతలకుమాత్రమే పునర్వివాహానుజ్ఞ నియ్య నుద్దే శించిన ట్లెంచఁదగియున్నది.

3. యా పూర్వం పతిం విత్వాథాఽన్యం విందతే పతిం
పంచౌదనం చ తావజం దదాతో న వియోషతః. ౨౭
సమానలోకో భవతి పునర్భువా పరఃపతిః
యోఽజం పంచౌదనం దక్షిణా జ్యోతిషం దదాతి. ౨౮
అనుపూర్వవత్సాం ధేను మనడ్వాహ ముపబర్హిణం
వాసో హిరణ్యం దత్వా తే యాంతి దివ ముత్తమమ్. ౨౯

అథర్వసంహిత, ౯ కాండ, ౫ ప్రపాఠకము.

ఒకస్త్రీ మొదట నొకనిని వివాహమాడి మరల మఱియొకనిని వివాహము చేసుకొన్నయెడల, అజాపంచౌదనముచేసిన యా దంపతు లెడఁబాయకుందురనియు; దక్షిణాపూర్వకముగా నజాపంచౌదనవ్రతమును జేసినయెడల పునర్భువు రెండవభర్తలోకమును పొందు ననియు, సవత్సకగోదానాదులనుజేసి వారుత్తమలోకమును పొందుదురనియు, పైశ్రుతి తాత్పర్యము. స్త్రీపునర్వివాహము నింతకన్న స్పష్టముగాఁ జెప్ప శ్రుతికి యుండనేరదు. పూర్వకాలమునందు బ్రాహ్మణులు బ్రాహ్మణేతరజాతులలోని స్త్రీలను మాత్రమేకాక, బ్రాహ్మణేతర జాతుల విధవలనుగూడి వివాహమాడుచు వచ్చిన ట్లీక్రింది యధర్వవేద వచనము చూపుచున్నది.

౮. ఉత యత్పతయో దశ స్త్రియాః పూర్వే అబ్రాహ్మణా
బ్రహ్మ చేత్ హస్త మగ్రహీత్ స ఏవ పతి రేకధా
బ్రాహ్మణ ఏవ పతి ర్న రాజన్యో న వైశ్యః తత్సూర్య
ప్రబ్రువ న్నేతి పంచభ్యో మానవేభ్యః.

అధర్వసంహిత.

ఒకస్త్రీకి మొదట బ్రాహ్మణులు కానివారు పదిమంది భర్తలయి యామెను బ్రాహ్మణుఁడు పెండ్లి చేసికొన్న పక్షమున, అతఁడే యామెకు పతికాని, రాజన్యుఁడును వైశ్యుఁడును కాఁడనియు, ఈ యర్థమునే యైదుజాతుల మానవులకును సూర్యుఁడు చాటుచు తిరుగుచున్నాఁడనియు ఈశ్రుతి బోధించుచున్నది.

౯. తస్మా దేకస్య బహ్వో జాయా భవన్తి
నైకస్యై బహవ స్సహ పతయః
ఋగ్వేదము, ఐతరేయబ్రాహ్మణము, 3 పంచిక, ౨౨ ఖండ.

"ఆ కారణమువలన నొకపురుషునకు బహుభార్య లగుదురు; ఒకస్త్రీకి 'ఏకకాలమునందు' బహుభర్తలు కారు" అని యీ శ్రుతి కర్థము. పురుషవిషయమున కాలభేదమును దెలుపు పదమును బ్రయోగింపక, స్త్రీవిషయమున నేకకాలమునందని తెలియఁజేయు "సహ" శబ్దమును బ్రయోగించుటచేతనే స్త్రీలకు భిన్నకాలములయందు వేఱు వేఱు భర్త లుండవచ్చు నన్నమాట స్పష్టమగుచున్నది. భారత వ్యాఖ్యానమునందు నీలకంఠాచార్యులవారీశ్రుతికి "సహేతి యుగపద్బహుపతిత్వ నిషేధో నతు సమయభేదేన" యని 'సహ' యనుట వలన నేకకాలమునందు బహుపతిత్వనిషేధమేకాని కాలభేదమునందుఁ గాదని యర్థము వ్రాసియున్నారు.

౬. సోమః ప్రథమో వివిదే గంధర్వో వివిద ఉత్తరః
తృతీయో అగ్నిష్టే పతి స్తురీయ స్తే 'మనుష్యజాః.'

ఋగ్వేదము, ౧౦ మండలము, ౨ అధ్యాయము, ౮౫ సూక్తము

"నీకు సోముఁడు మొదటి భర్త; రెండవభర్త గంధర్వుఁడు; మూడవభర్త అగ్ని; నాలవభర్త నీకు మనుష్యునివలనఁ బుట్టినవాఁడు' అని యీశ్రుతి తాత్పర్యము. ఇది వివాహమంత్రములయందు వచ్చును. నీకు (స్త్రీకి) నాలవభర్త మనుష్యునివలనఁ బుట్టినవారు "మనుష్యజాః" అని బహువచనమును బ్రయోగించుటచేత స్త్రీలకు భిన్నకాలముల యందు బహుభర్త లుందురని యీ శ్రుతి సూచించుచున్నది. "తురీయః" అను విశేషణ మేకవచనమునం దుండుటచేత నొక్కకాలమునం దొక్క భర్తమాత్రమే యుండవలయుననియు "మనుష్యజాః" అని విశేష్యము బహువచనమునం దుండుటచేత నొక పతి యనంతరము మఱియొక పతి చొప్పున బహుభర్త లుందురని సారస్యము కనుపట్టుచున్నది.

౭. కుహస్విద్దోషా కుహవస్తోరశ్వినా కుహాభిపిత్వం
కరతః కుహోషతుః కోవాంశయుత్రా 'విధవేవ దేవరం'
మర్యన్న యోషా కృణుతే సదస్థ ఆ.

ఋగ్వేదము, ౮ అష్టకము.

ఈ ఋగ్వేదవచనమునందు "విధవ పాన్పునందు దేవరుని కోఱకు కనిపెట్టుకోని యున్నట్లు" అని యొక యుపమానము కనఁబడుచున్నది. వేదమునం దెక్కడను నియోగము విధింపఁబడి యుండలేదనియు, స్త్రీ మఱఁదిని వివాహమాడెడి యాచారము కనఁబడుచున్నదనియు, ఎల్లవారును నెఱిఁగి యుండవచ్చును. అందుచేతనే యీ దేవరశబ్దము నకు నిరుక్తమునందు 'ద్వితీయవరుఁడు' అని యర్థము వ్రాయఁబడి యున్నది.

నిరుక్తము—క్వస్విద్రాత్రౌ భవథః క్వ వా ల్వాభిప్రాప్తిం
కురుథః క్వ వసథః । కోవాం శయనే విధవేవ దేవరం
దేవరః కస్మా ద్ద్వితీయో వర ఉచ్యతే॥

ఈ శ్రుతికూడ పూర్వకాలమునందు విధవలు ద్వితీయభర్తలతో సుఖ మనుభవించుచుండుట సర్వసాధారణముగా నుండెనని చూపుట కనుకూలపడుచున్నది.

౮. అంత్రేకాక వేదమునం దనేకస్థలములలో దిధిషువు పేరుదా హరింపఁబడి యున్నది. "పునర్భూ దిధిషూ రూఢా ద్విస్తస్యా దిధిషుః పతిః" అను నమరకోశమువలన వివాహితయొక్క ద్వితీయభర్త దిధిషువని యెల్లవారు నెఱిఁగియుందురు. తైత్తిరీయబ్రాహ్మణమున 3 కాండ, ౪ ప్రపాఠకము, ౧ అనువాకమునందు, అరాధియను దేవ తకు దిధిషువును బలిపెట్టవలసినట్టు చెప్పఁబడి యున్నది. ఆ యనువాక మునందే వేఱువేఱు దేవతలకు వరుసగా పిల్లలను, స్త్రీలను, వృద్ధులను,

వేదము చదివిన బ్రాహ్మణులను బలిపెట్టవలసినట్టుకూడఁ జెప్పఁబడి యున్నది. ఇప్పుడు చెప్పినదానివల్లను, నరమేధయాగ ముండుటవల్లను, పూర్వకాలమునందు నరబలు లుండెననుట స్పష్టము. వేదమునందు దిధిషుశబ్దము పలుచోట్ల కనఁబడుచుండుటవలన, ఆకాలమునందు పురుషులకువలెనే స్త్రీలకును పునర్వివాహములు సాధారణముగా నున్నట్టు తెలియవచ్చుచున్నది.

౯. ఋగ్వేద, ౮ అష్టకము, ౧౦ మండలము, ౧౦౯ సూక్తమునందు ఒకబ్రాహ్మణుని భార్యయగు 'జుహు' అనెడిస్త్రీ బృహస్పతికి మరల వివాహము చేయఁబడినట్టు చెప్పఁబడి యున్నది. దీని వలన వేదమునందు స్త్రీపునర్వివాహమును విధించునట్టియు సూచించు నట్టియు వచనములు మాత్రమేకాక సరిగా స్త్రీ పునర్వివాహము జరిగిన నిదర్శనముకూడ స్పష్టముగాఁ గానవచ్చు చున్నది.

స్త్రీ పునర్వివాహము వేదచోదితమని చూపుట కిట్టిన్ని సాధకములు గనుఁబట్టుచున్నప్పుడు ప్రతిపక్షులు వేదమునుండి యొక్క బాధక వచనమునైనఁ గనఁబఱుపఁ గలుగుదురా? వారు తీసికొనివచ్చెడి దంతయు,—

> యదేకస్మిన్ యూపే ద్వే రశనే పరివ్యయతి తస్మా దేకో
> ద్వేజాయే విందతే। యన్నైకాగ్ం రశనాం ద్వయో
> ర్యూపయోః పరివ్యయతి తస్మాన్నైకా ద్వౌ పతీ విందతే.

కృష్ణ యజుర్వేదము, ౬ కాండము, ౬ ప్రపాఠకము, ౪ అనువాకము.

ఒక యూపమునకు రెండుత్రాళ్ళను గట్టునట్లే యొకని కిద్దఱు భార్య లుండును; ఒక త్రాడును రెండుయూపములకు కట్టకూడనట్లే ఒకస్త్రీ కిద్దఱు భర్త లుండరను నర్థమిచ్చెడి యీ యొక్క స్మృతియు తప్ప వేఱేదియుఁ గానరాదు. ఈ శ్రుతి యేకకాలమునందే స్త్రీలకు

బహుపతులను నిషేధించుచున్న దనుట కొంచె మాలోచించువారి కందఱికిని దెలియును. దీనికి వినియోజక వాక్యమైన "అగ్నిష్ఠం ద్వాభ్యాగ్ం రశనాభ్యాం పరివీయ" యను కల్పసూత్రము ఏకకాలము నందే యూపమునకు రశనాద్వయబంధమును విధించుచు పయి నిర్బంధ మేకకాలమునందు మాత్రమే యని స్పష్టపఱుచుచున్నది. దృష్టాంత మునుబట్టి చూచినను, ఒక్కత్రాటిని రెండు స్తంభముల కేకకాలము నందు కట్టుట యశక్యముగాని యొక స్తంభమున నున్నదానిని విప్పి మఱియొక స్తంభమునకుఁ గట్టుట యసాధ్యము కాదు. కాఁబట్టి కాలాంతరములయందు స్త్రీలకు భిన్నపతులుండుట కే యాక్షేపణ మును గనఁబడదు. పూర్వోక్తములయిన శ్రుతివచనములతో సమన్వ యించునట్లు అర్థము చేసెడి పక్షమున దీనికి మఱియొక యర్థమును గల్పించి సాధించుట కెవ్వరికిని శక్యముకాదు. అంతేకాక యీ శ్రుతి యందలి నిషేధము సామాన్యముగా నున్నది; ఉదీర్ష్వనారీత్యాది శ్రుతులు విశేషముగా మృతభర్తృకకు పునర్వివాహమును విధించు చున్నవి. కాఁబట్టి మృతభర్తృకకు తప్ప ద్వితీయభర్త యుండఁగూడ దనియైనను విశేషసామాన్యభావముచేత నీ శ్రుతి కర్థము చేయ వచ్చును. ఇంతవఱకును విచారించిన దానినిబట్టి శ్రుతులలో పరస్పర విరుద్ధములగు వచనము లేవియుఁ గనఁబడలేదు గాని, ఒకవేళ కనఁబడినను,—

శ్లో. ధర్మం జిజ్ఞాసమానానాం ప్రమాణం పరమం శ్రుతిః
శ్రుతి ద్వైధంతు యత్రస్యా త్తత్ర ధర్మావుభౌ స్మృతౌ.

అను మనువచనమునుబట్టి శ్రుతి రెండువిధములఁ జెప్పిన యెడల వికల్పముచేత రెండును ప్రమాణములే యగును గనుక,

అప్పుడు సహిత మిష్టమున్నవారు వివాహము చేసుకొనవచ్చుననియే పరమసిద్ధాంత మేర్పడును.

ధర్మనిర్ణాయక గ్రంథములలోనెల్ల నుత్కృష్ట ప్రమాణమయిన శ్రుతి సోమిదేవివఱకును స్త్రీల కందఱికిని పునర్వివాహము నంగీకరించుచున్నదనియు, అట్టి పునర్వివాహితను విడువఁగూడదనియే కాక యాదంపతులకు పుణ్యలోకము వచ్చుననికూడ తెలుపుచున్నదనియు ఇంతవఱకును వ్రాసినదాని వలన విస్పష్టముగాఁ గనబఱిచియున్నాను.

చతుర్యుగ సామాన్య స్మృతి ప్రమాణములు.

స్మృతి ప్రమాణముల నుదాహరించుటకు ముందు సమస్తస్మృతులును సమానబలము కలవి యగునో కావో, కానియెడల నే స్మృతు లెప్పుడు బలవత్తరములో వివరింపవలసియున్నది.

శ్లో. అన్యే కృత యుగే ధర్మాస్త్రేతాయాం ద్వాపరే పరే
అన్యే కలియుగే నృణాం యుగ హ్రాసానురూపతః.

అను మనువచనమునుబట్టి యుగసామర్థ్య దౌర్బల్యానురూపముగా కృతయుగ ధర్మములు వేఱనియు, త్రేతాయుగ ధర్మములు వేఱనియు, ద్వాపరయుగ ధర్మములు వేఱనియు, కలియుగ ధర్మములు వేఱనియు తెలియవచ్చుచున్నది. ఇఁక నే యుగములో నే ధర్మశాస్త్రము ప్రబలమైనదో నిర్ణయింపవలయును.

శ్లో. కృతేతు మానవా ధర్మా స్త్రేతాయాం గౌతమాః స్మృతాః
ద్వాపరే శాంఖలిఖితాః కలౌ పారాశరాః స్మృతాః.

అను బృహస్పతి పరాశర వచనములవలన కృతయుగమునందు మనుస్మృతియు, త్రేతాయుగమునందు గౌతమస్మృతియు, ద్వాపరయుగమునందు శంఖస్మృతియు లిఖితస్మృతియు, కలియుగమునందు పరా

శరస్మృతియు ముఖ్యములైనవని స్పష్టపడుచున్నది. ఆయా యుగముల యందు క్రమముగా పూర్వోదాహృతములయిన స్మృతులు మాత్రమే ప్రమాణములైనచో యాజ్ఞవల్క్యాది సమస్తేతర స్మృతులును నిష్ప్రయోజనములు కావలసివచ్చునని కొందఱికి సందేహము పుట్ట వచ్చును. ఆ యుగస్మృతియందుఁ జెప్పఁబడని యంశములలో తక్కిన స్మృతులును ప్రమాణములే యగును గనుక, అన్నిటివలనను ప్రయోజనము గలదు. ఈ స్మృతులలో పరస్పరవిరోధము కలిగినప్పుడు ధర్మము వికల్పమని యాజ్ఞావల్క్యస్మృతి వ్యాఖ్యానమునందు విజ్ఞానేశ్వర యోగి నిర్ణయించియున్నాఁడు.

మ ను వు.

౧ శ్లో. నష్టే మృతే ప్రవ్రజితే క్లీబేచ పతితే పతౌ
పంచ స్వాపత్సు నారీణాం పతి రన్యో విధీయతే.

పతి దేశాంతరగమనముచేత నష్టుఁడైనప్పుడును, మృతుఁడైనప్పుడును, సన్యసించినప్పుడును, నపుంసకుడైనప్పుడును, కులభ్రష్టుడయినప్పుడును, ఈ యైదాపదలయందును స్త్రీలకు మఱియొక భర్త విధింపఁబడుచున్నాఁడు—అని పై శ్లోకార్థము. ఇది యిప్పుడు ముద్రితమైయున్న మనుస్మృతియందుఁ గనఁబడదు కాని మాధవాచార్యుని కాలమువరకు మనుస్మృతిలో నీ వచనమున్నట్లు పరాశరమాధవీయములో వివాహప్రకరణమున మాధవాచార్యులీ వచనము మనుస్మృతిలోనిదని యుదాహరించుటవలన విస్పష్టమగుచున్నది. నారదస్మృతి కూడ పై వచనము మనుస్మృతిలోనిదే యయినట్లు సాక్ష్యమిచ్చుచున్నది.

శ్లో. ప్రోషితో ధర్మకార్యార్థం ప్రతీక్ష్యోష్టౌ నర స్సమాః
విద్యార్థం షడ్యశోర్థం వా కామార్థం త్రీంతు వత్సరాన్.

అను మనుస్మృతిలోని తొమ్మిదవ యధ్యాయమునందలి యీ శ్లోకమునకు ముందు "నష్టే మృతే" యను శ్లోకము పూర్వముండి యున్న ట్లూహింపఁదగియున్నది. భర్త ధర్మకార్యార్థము దేశాంతర గతుఁ డయినపక్షమున నెనిమిది సంవత్సరములును, విద్యార్థమైనయెడల నాఱుసంవత్సరములును, కీర్తి కొఱకుఁగాని కామముకొఱకుఁగాని యయిన యెడల మూఁడుసంవత్సరములును ప్రతీక్షింపవలసినట్టుమాత్రము పయి శ్లోకమువలనఁ గనఁబడుచున్నది గాని తరువాత భార్య యేమి చేయవలెనో యెక్కడను గనఁబడదు. "నష్టే మృతే" యను శ్లోక మిక్కడ నున్న పక్షమున తరువాత మఱియొకనిని వివాహమాడ వలయునన్న మాట స్పష్టము. ఇందలి యెనిమిదిసంవత్సరముల మితియు భర్త నష్టుఁడయినయెడల భార్య పునర్వివాహమునకు వేచియుండ వలసిన కాలమును దెలుపు ముందుదాహరింపఁబోయెడి నారద వచ నముతో నేకీభవించుచున్నది. ఎనిమిది సంవత్సరముల తరువాత భార్య భర్తను వెదకుకొనుచు పోవలయునని కుల్లూకభట్టు వ్యాఖ్యానములో వ్రాసినాఁడుగాని, నష్టుఁడయినవాని నిమిత్తమయి యెనిమిది సంవత్సర ములు వేచియుండి తరువాత వెనుకకొనుచు వెళ్ళవలయునన్న మాట సయుక్తికము కానేరదు. "ఊర్ధ్వం భర్త్రంతర పరిగ్రహే న దోషో స్త్రీత్వభిప్రాయః" అని తరువాత మఱియొక భర్తను గ్రహించుట యందు దోషములేదని వ్రాసిన శ్రీనందన వ్యాఖ్యానమే యెంతయు యుక్తియుక్తమయినది.

౨ శ్లో. సా చేదక్షతయోనిః స్యాద్గతప్రత్యాగతాపి వా
పౌనర్భవేన భర్త్రా సా పునస్సంస్కార మర్హతి.

ఆ స్త్రీ (విధవయైనట్టిగాని భర్తచేత విడువఁబడినట్టిగాని స్త్రీ) వెళ్లి మరల వచ్చినదయినను అక్షతయోనియైనయెడల పునర్భువును

వివాహమును చేసికొనెడు భర్తచేత మరల వివాహమున కర్హురాలగు చున్నది—అని యీ మనువచనమున కర్థము. "క్షతా సంస్కారా త్ప్రాగేవ పురుష సంబంధ దూషితా" అను మితాక్షరావచనమును బట్టి పునర్వివాహమునకు మునుపే పురుషసంభోగముచేత దూషితురా లయిన స్త్రీ క్షతయనఁబడును; అట్టి పురుషసంభోగమును పొందనిది అక్షతయోని. "వైవాహికో విధిః స్త్రీణాం సంస్కారో వైదికః స్మృతః" అను మనువచనమును బట్టి స్త్రీలకు వివాహము సంస్కార మనఁ బడును.

నారదుఁడు.

3. శ్లో. నష్టే మృతే ప్రవ్రజితే క్లీబే చ పతితే పతౌ
పంచ స్వాపత్సు నారీణాం పతి రన్యో విధీయతే.

ఈ శ్లోకమును నారదుఁడు మనుస్మృతి నుండియే గ్రహించి యున్నాఁడు. ఇది వాగ్దాత్తాపరమని, నియోగపరమని వ్యర్థవాదములు చేయువారిని సమాధానపఱుచుటకయి దీని క్రింది శ్లోకములను గూడ సందర్భోచితముగా నిందుదాహరించు చున్నాఁడను. పయిని జెప్పఁబడిన యయిదాపదలలోను నష్టుని విషయమునందును, నపుంసకుని విషయమునందును మాత్రమే కాలనియమము కావలసియుండును.

శ్లో. అష్టౌ వర్షాణ్యపేక్షేత బ్రాహ్మణీ ప్రోషితం పతిమ్
అప్రసూతా తు చత్వారి పరతోఽన్యం సమాశ్రయేత్
క్షత్రియా షట్సమా స్తిష్ఠే దప్రసూతా సమాత్రయమ్
వైశ్యా ప్రసూతా చత్వారి ద్వే వర్షే త్వితరా వసేత్
న శూద్రాయాః స్మృతః కాల ఏవ ప్రోషితయోషితాం
జీవతి శ్రూయమాణే తు స్యాదేష ద్విగుణోవిధిః.

భర్త నష్టుఁడైనయెడల బ్రాహ్మణస్త్రీ యెనిమిదిసంవత్సరములును, సంతానము లేనియెడల నాలుగుసంవత్సరములును వేచియుండి మఱియొకనిని సమాశ్రయింపవలెననియు; క్షత్రియస్త్రీ యాఱుసంవత్సరములును, సంతానవంతురాలు కానియెడల మూఁడు సంవత్సరములును, వైశ్యస్త్రీ సంతానము కలది నాలుగు సంవత్సరములును, సంతానము లేఁది రెండుసంవత్సరములును కనిపెట్టి యుండి తరువాత మఱియొకని నాశ్రయింపవలయు ననియు; శూద్రస్త్రీల కట్టి కాలనియమము లేదనియు; భర్త జీవించినవార్త తెలియవచ్చుచున్నయెడల పైకాలమునకు ద్విగుణకాలము వేచియుండవలెననియు; "నష్టే మృతే" యను శ్లోకముక్రింద నవ్యవధానముగా నున్న యీ శ్లోకములు చెప్పుచున్నవి. సంతాన మున్నవారికి నియోగము లేదు గనుకను, వాగ్దత్తలకు సంతానము గలుగుట యసందర్భము గనుకను, పయివిధి వాగ్దత్తాపరమని కాని, నియోగపరమని కాని చెప్ప వలనుపడదు. మఱియును,—

౮. శ్లో. ఈర్ష్యా దండాదయోఽన్యేచ చత్వార స్సముదాహృతాః
త్యక్తవ్యాస్తే పతితవత్ క్షతయోన్యా అపిస్త్రియా ॥
ఆక్షిప్తమోఘబీజానాం కృతేపి పతి కర్మణి
పతి రన్యః స్మృతో నార్యా వత్సరార్థం ప్రతీక్ష్య తు ॥

అను తరువాతి శ్లోకములు, ఈర్ష్యాదండాదు లగు నలుగురు నపుంసకులును క్షతయోనియైనను స్త్రీచేత పతితులవలె విడువఁదగిన వారనియు, ఆక్షిప్తమోఘబీజుల విషయములో పతికర్మ జరిగినను ఆఱుమాసములు ప్రతీక్షించి స్త్రీ మఱియొక పతిని గైకొనవచ్చు ననియు చెప్పుచున్నవి. వాగ్దత్తలకను పక్షమున వారు క్షతయోను లగుట కాని పతికర్మ జరగుటకాని సంభవింపనేరదు. నియోగ మను

పక్షమున బ్రతికియున్న మగని యనుమతి లేక పతిని పతితునివలె త్యజించి స్త్రీ స్వతంత్రించి మఱియొక పతిని చేకొనుట సంభవింపనేరదు. కాఁబట్టి "నష్టే మృతే" యనుశ్లోకము నారీ పునర్వివాహపర మనక తప్పదు.

౫. ఉద్వాహితాపి యా కన్యా నచే త్సంప్రాప్త మైథునా
పున స్సంస్కార మర్హేత యథా కన్యా తథైవ సా ॥

కన్య వివాహితురా లయినను పురుషసంభోగము పొందని దయిన పక్షమున కన్యక వలెనే పునర్వివాహమున కామె యర్హురా లగును.

శాతాతపుఁడు.

౬. శ్లో. వరశ్చే త్కులశీలాభ్యాం నయుజ్యేత కదా చన
న మంత్రాః కారణం తత్ర న చ కన్యానృతం భవేత్ ॥
సమాచ్ఛిద్యతు తాం కన్యాం బలా దక్షతయోనికాం
పున ర్గుణవతే దద్యా దితి శాతాతపోఽబ్రవీత్ ॥
హీనస్య కులశీలాభ్యాం హర న్కన్యాం న దోషభాక్
న మంత్రాః కారణం తత్ర నచ కన్యానృతం భవేత్ ॥

వరుఁడు కులశీలములచేత హీనుఁ డయినప్పుడు అక్షతయోని యైన కన్యను బలవంతముగా పుచ్చుకొని మరల గుణవంతుని కీవలయు ననియు, అట్టిచో వివాహమంత్రములు ప్రయోజనకరములు కావనియు, కన్యానృతము సంభవింప దనియు, పై వచనముల తాత్పర్యము.

వసిష్ఠుఁడు

౭ శ్లో. పాణిగ్రాహే మృతే బాలా కేవలం మంత్రసంస్కృతా
సా చే దక్షతయోని స్స్యాత్ పునస్సంస్కార మర్హతి॥

పాణిగ్రహణము చేసినవాఁడు మృతుఁ డయినప్పుడు కేవల మంత్ర సంస్కృతురా లయిన కన్య అక్షతయోని యైనయెడల పునర్వివాహమున కర్హురా లగును.

౮. శ్లో. కులశీల విహీనస్య షండాది పతితస్య చ
అపస్మారీ విధర్మస్య రోగిణాం వేషధారిణాం
దత్తామపి హరేత్కన్యాం సగోత్రోఢాం తథైవ చ॥

భర్త కులశీలములచేత హీనుఁడును, షండుఁడును, పతితుఁడును, వెఱ్ఱివాఁడును, విధర్ముఁడును, రోగియు, వేషధారియు, సగోత్రుఁడును, అయిన యెడల దత్తురాలయినను కన్యను మరల పుచ్చుకోవలెను.

కాత్యాయనుఁడు.

౯. శ్లో. స తు యద్యన్యజాతీయః పతితః క్లీబ ఏవ చ
వికర్మస్థ స్సగోత్రోవా దాసో దీర్ఘామయోపి వా
ఊఢాపి దేయా సాన్యస్మై సప్రావరణభూషణా.

మగఁడు అన్యజాతీయుఁడును, నపుంసకుఁడును, వికర్మస్థుఁడును, సగోత్రుఁడును, దీర్ఘరోగియును అయినప్పుడు వివాహితురాలయినను స్త్రీ వస్త్రములతోను నగలతోనుకూడ మరల మఱియొకని కియ్యఁ దగినది.

ఈరీతి వచనములే ప్రజాపతిస్మృతియందును, బోధాయన స్మృతి యందును, మఱికొన్ని చోట్లనుగూడ కానఁబడుచున్నవి. వీనిలో కొన్ని విధవావివాహమునుగూర్చి చెప్పకపోయినను సాధారణముగా స్త్రీపునర్వివాహమునుగూర్చి చెప్పుచున్నవి గనుక, సప్తపద్యనంతరము కన్యను మఱియొకని కియ్యఁగూడదను వారి వాదమును ఖండించుట కివియన్నియు పరమప్రయోజనకరములుగా నుండును. స్త్రీ పున

ర్వివాహమున కనుజ్ఞ యిచ్చుచున్న తొమ్మిది స్మృతులలోను అయిదు విధవావివాహము లంగీకరించుచున్నవి. తక్కిన స్మృతులన్నియు నీవిషయమున మూకీభావమును వహించుచున్నవి. ఇట్లెన్ని స్మృతులు స్త్రీపునర్వివాహము నంగీకరించుచుండఁగా స్త్రీపునర్వివాహమును నిషేధించు స్మృతి యొక్కటియైనను గనఁబడదు. ప్రతిపక్షులు కష్టపడి తీసికొనివచ్చినదంతయు నీ క్రింద నుదహరింపఁబడిన యొక్క యాశ్వలాయనవచనము.

శ్లో. అజ్ఞాతశ్చ ద్విజో యస్తు విధవా ముద్వహేద్యతి
పరిత్యజ్య చ తాంచైవ ప్రాయశ్చిత్తం సమాచరేత్.

ద్విజుఁడు తెలియక విధవను వివాహము చేసికొన్న పక్షమున దానిని పరిత్యజించి ప్రాయశ్చిత్తము చేసుకోవలెనని పై వచనమున కర్థము. ఇది యొక్కటితప్ప ఖండనవాదుల కాధారము లేశ మయినను లభింపలేదు. దీనికైనను,—

శ్లో. పాణిగ్రాహే మృతే బాలా కేవలం మంత్ర సంస్కృతా
సాచే దక్షతయోనిః స్యా త్పునస్సంస్కార మర్హతి.

ఇత్యాది పూర్వోదాహృత స్మృతివచనములతో సమన్వయించు నట్లుగా నర్థముచేయునప్పుడు సామాన్యవిశేషభావముచే క్షతయోనికా పునర్వివాహనిషేధము మాత్రమే యర్థమగును. పూర్వోక్తము లయిన స్మృతివాక్యములను బట్టి విచారింపఁగా కొందఱు స్మృతికర్త లక్షతయోనికావివాహమును మాత్ర మంగీకరించినట్టును, కొంద అక్ష తయోనులకును క్షతయోనులకును కూడ వివాహ మంగీకరించినట్టును స్పష్టమగుచున్నది. ఋషులలో నిట్టి యభిప్రాయభేద మున్నను, స్త్రీపునర్వివాహము నంగీకరింపని ఋషి యొకఁడును కనఁబడఁడు. ఈ యాశ్వలాయనుఁ డక్షతయోనికా వివాహమును మాత్ర మంగీక

రించు తరగతిలోనివాఁడుగా నున్నాఁడు. ఇంతవఱకును జూపిన వచనములవలన స్త్రీపునర్వివాహము వేదమునుబట్టి మాత్రమే కాక చతుర్యుగ సామాన్యములయిన సమస్త స్మృతులనుబట్టియుకూడ నిర్వివాదముగా స్థాపన మగుచున్నది గదా? ఇట్లిన్ని ప్రబలనిదర్శనము లున్నను పాటింపక విరోధులు తమవాదమున కేమో సాధకములుగా నున్న వనుకొని సంతోషించు మన్వాది వచనములనుగూర్చి కొంచెము విచారింతము.

బాధక స్మృతులు.

౧. శ్లో. న ద్వితీయశ్చ సాధ్వీనాం క్వచి ద్భర్తోపదిశ్యతే.
౨. ఆసీతాఽమరణాత్ క్షాంతా నియతా బ్రహ్మచారిణీ.

అను మనువచనముల నుదాహరించి స్త్రీల కెక్కడను ద్వితీయ భర్త విధింపఁబడలేదనియు, మృతభర్తృక మరణాంతమును బ్రహ్మచారిణి యయియే యుండవలయు ననియు, ప్రతిపక్షులు చెప్పుచున్నారు. పూర్వోక్తవచనము లెక్కడ చెప్పఁబడినవో సందర్భము కొంచెము విచారించిన పక్షమున, అవి పునర్వివాహ నిషేధకములు కావని బాలుఁడయినను తెలిసికొనవచ్చును.

మనుస్మృతి పంచమోధ్యాయము.

శ్లో. యస్మై దద్యా త్పితా త్వేనాం భ్రాతా వాఽనుమతే పితుః
తం శుశ్రూషేత జీవంతం సంస్థితం చ నలంఘయేత్. ౧౫౧

మంగళార్థం స్వస్త్యయనం యజ్ఞశ్చాసాం ప్రజాపతేః
ప్రయుజ్యతే వివాహేషు ప్రదానం స్వామ్యకారణం. ౧౫౨

అనృతావృతుకాలే చ మంత్రసంస్కారకృత్పతిః
సుఖస్య నిత్యం దాతేహ పరలోకే చ యోషితః. ౧౫౩

విశీలః కామవృత్తో వా గుణైర్వా పరివర్జితః
ఉపచర్యః స్త్రియా సాధ్వ్యా సతతం దేవవ త్పతిః॥ ౧౫౪

నాస్తి స్త్రీణాం పృథగ్యజ్ఞో నవ్రతం నాప్యుపోషితం
పతిం శుశ్రూషతే యేన తేన స్వర్గే మహీయతే. ౧౫౫.

పాణిగ్రాహస్య సాధ్వీ స్త్రీ జీవతో వా మృతస్య వా
పతిలోక మభీప్సంతీ నాచరే త్కించి దప్రియమ్. ౧౫౬.

కామంతు క్షపయే ద్దేహం పుష్పమూలఫలై శ్శుభైః
న తు నామాపి గృహ్ణీయా త్పత్యౌ ప్రేతేఽపరస్య తు. ౧౫౭.

ఆసీతాఽమరణాత్ క్షాంతా నియతా బ్రహ్మచారిణీ
యోధర్మ ఏకపత్నీనాం కాంక్షంతీ త మనుత్తమమ్. ౧౫౮.

అనేకాని సహస్రాణి కుమార బ్రహ్మచారిణాం
దివం గతాని విప్రాణా మకృత్వా కులసంతతిమ్. ౧౫౯.

మృతే భర్తరి సాధ్వీ స్త్రీ బ్రహ్మచర్యే వ్యవస్థితా
స్వర్గం గచ్ఛ త్యపుత్రాపి యథా తే బ్రహ్మచారిణః. ౧౬౦.

అపత్యలోభా ద్యాతు స్త్రీ భర్తార మతివర్తతే
సేహ నిందా మవాప్నోతి పతి లోకాచ్చ హీయతే. ౧౬౧.

నాన్యోత్పన్నా ప్రజా స్త్రీహ నచాప్యఽన్యపరిగ్రహే
నద్వితీయశ్చ సాధ్వీనాం క్వచి ద్భర్తోపదిశ్యతే. ౧౬౨.

పతిం హిత్వాపకృష్టం స్వ ముత్కృష్టం యా నిషేవతే
నింద్యైవ సా భవేల్లోకే పరపూర్వేతి చోచ్యతే. ౧౬౩.

వ్యభిచారాత్తు భర్తుః స్త్రీ లోకే ప్రాప్నోతి నింద్యతామ్
సృగాలయోనిం ప్రాప్నోతి పాపరోగైశ్చ పీడ్యతే. ౧౬౪.

మనువు స్త్రీధర్మములను వివరించుచు, ౧౫౧ వ శ్లోకముచేత తండ్రికాని, తండ్రి యనుమతిని భ్రాతకాని యెవనికిచ్చి వివాహము చేయునో యతనికి స్త్రీ బ్రతికియున్నంతవఱకు పరిచర్యచేయుచు, చచ్చిన తరువాతను వ్యభిచరింపఁ గూడదని చెప్పినాఁడు. "నలంఘ

యేత్” అనుపదము నాధారముచేసికొని పునర్వివాహము చేసికొనఁ గూడదని ప్రతివాదు లర్థము చేయఁజూతురు గాని యట్టి తలంపు వ్యర్థము. వ్యాఖ్యానములో కుల్లూకభట్టు సహితము (నాతిక్రమేత్ వ్యభిచారేణ తదీయ శ్రాద్ధతర్పణాఽకరణేన పారలౌకికకృత్య ఖండనేన చ) వ్యభిచారముచేతను శ్రాద్ధతర్పణాదులు చేయక పోవుటచేతను పారలౌకికకృత్య ఖండనముచేతను అతిక్రమింపఁగూడదనియే యర్థము వ్రాసియున్నాఁడు. తరువాత ౧౫౭ వ శ్లోకము వఱకును సువాసినీ ధర్మములను బోధించుచు స్త్రీకి భర్తయే యిహపర లోకములయందు సుఖదాయకుఁడనియు, అతఁడు మంచినడత లేనివాఁడయినను కామవ్యాపారమునందు వర్తించువాఁ డయినను గుణహీనుఁ డయినను విడిచిపెట్టక పతివ్రతయైన స్త్రీ పతికి పరిచర్య చేయవలయు ననియు, స్త్రీకి పతి శుశ్రూషకంటె వేఱుగ నుపవాసములును, వ్రతములును, యజ్ఞములును లేవనియు, పతిలోకమును గోరెడి స్త్రీ పతి జీవించి యున్నను మృతుఁడైనను కొంచెమయిన నతని కప్రియము చేయఁగూడదనియు చెప్పియున్నాఁడు. ఇక్కడ నప్రియమను స్థలమునందును, వ్యభిచారముచేతను విహితశ్రాద్ధఖండనముచేతను ననియే వ్యాఖ్యానము చేయఁబడినది గాన ప్రతివాదులు దానికి మఱియొక్క యర్థమును కల్పింపఁబూనుట వృథాప్రయాసము. అటుతరువాత మనువు విధవాధర్మములను జెప్పుచు ౧౬౧ శ్లోకము వఱకును పుష్పమూలఫలాదులచేత దేహమును శుష్కింపఁ జేయవలయు ననియు, పరపురుషుని యొక్క నామోచ్చారణమునైనను చేయఁగూడ దనియు, మరణము వరకును బ్రహ్మచారిణియై నియమము గలదియై యుండవలసిన దనియు, సంతానము లేకపోయినను కుమారబ్రహ్మచారులు స్వర్గమును పొందినట్టే భర్త పోయినతరువాత బ్రహ్మచర్యవ్రతమును నడి

పెడి సాధ్వియు సంతానహీనురాలయినను స్వర్గమునకు వెళ్ళుననియు, సంతానాపేక్షవలన భర్తనతిక్రమించి వర్తించు స్త్రీ యీ లోకమున నింద పొందుటయేకాక పరలోకమునుండి భ్రష్టురాలగుననియు, చూపియున్నాఁడు. "అతివర్తతే" యనుదానికి 'వ్యభిచరతి" యనియే కుల్లూకభట్టర్థము వ్రాసి యున్నాఁడు. విధవకు బ్రహ్మచర్యమును చెప్పినంతమాత్రమున మృతభర్తృకలు మఱియొకలాగున నుండగూడ దనియే సిద్ధాంత మేర్పరచినయెడల, సా చే దక్షతయోనీత్యాది పునర్వివాహవిధులును సహగమనవిధులును నిరర్థకములు కావలసివచ్చును. అటుపిమ్మట పరునివలనఁ బుట్టినవాఁడా స్త్రీకిఁగాని యీ పరపురుషునకుఁగాని పుత్రుఁడు కాఁడనియు, ద్వితీయుఁ డనఁగా భర్తృవ్యతిరిక్తుడయిన జారపురుషుఁడు సాధ్వుల కెప్పుడును భర్త యనిపించుకొనఁడనియుఁ ౧౬౨ వ శ్లోకముచేతఁ జెప్పియున్నాఁడు. కడపటి రెండు శ్లోకములచేతను తక్కువవాఁడైన భర్తను విడిచి గొప్పవానినాశ్రయించునది యీ లోకమున నింద్యురాలయి పరపూర్వ యనఁబడు ననియు వ్యభిచరించు స్త్రీ యీ లోకమునందు నిందను పొంది నక్కజన్మమెత్తి పాపరోగములచేత పీడింపఁబడుననియు చూపబడినది. కాఁబట్టి విధవాధర్మముల నిరూపించెడునట్టియు వ్యభిచారమును దూషించెడునట్టియు పయివచనములలో నేదియు పునర్వివాహమును నిషేధించుటకుద్దేశింపఁబడ లేదని ప్రకరణమునుబట్టి బాలుఁడయినను సులభముగా తెలిసికొనవచ్చును.

శ్లో. పాణిగ్రహణికా మంత్రాః కన్యాస్వేవ ప్రతిష్ఠితాః
నాఽకన్యాసు క్వచిన్నౄణాం లుప్తధర్మక్రియా హి తాః.

మను. అ. ౮, శ్లో. ౨౨౬.

వివాహమంత్రములు కన్యలవిషయమే ప్రతిష్ఠింపఁబడి యున్న వనియు, ధర్మక్రియలు లేనివా రగుటవలన కన్యలు కానివారి విషయమయి కావనియు, మనువు చెప్పుటవలన కన్యలకే కాని విధవలకు వివాహము కూడదని ప్రతిపక్షులు చెప్పుదురు. ఇక్కడ ఆ కన్యలనఁగా వ్యభిచారాదులచేత కన్యాత్వము చెడఁగొట్టుకొన్నవారే కాని విధవలు మొదలయినవారు కారు. "లుప్తధర్మక్రియాః" అను హేతువును జెప్పుటవలనను, విధవలు ధర్మక్రియలు లేనివా రని యెవ్వరును చెప్పసాహసింపఁ జాలరు గనుకను, ఆ కన్యలను విధవలనుగాఁ జెప్పుటకు లేశమయిన నవకాశము లేదు. మఱియు నట్టియర్థమును జెప్పితిమేని, స్త్రీపునర్వివాహమును విధించు శ్రుతిస్మృతివచనము లన్నియు నర్థహీనము లయిపోవును. ఇదియంతయు నాలోచించియే కుల్లూకభట్టు వ్యాఖ్యానములో శాస్త్రవిహితమయిన వివాహరీతిని గాక యన్యవిధమున క్షతలైన వారని యకన్యల కర్థము వ్రాసియున్నాఁడు. అదిగాక విధవలకును వివాహితలకును స్మృతులయందు కన్యాపదవ్యవహారము కలదు,—

శ్లో. విధవా యా భవేత్కన్యా నిర్దోషా భర్తృవర్జితా
తస్యాఽఽవాసః పితుర్వేశ్మ సలజ్జా చైవ సర్వదా.—పరాశరుఁడు.

శ్లో. కన్యాయాం దత్తశుల్కాయాం మ్రియేత యది శుల్కదః
దేవరాయ ప్రదాతవ్యా యది కన్యాఽనుమన్యతే.— మనువు.

కన్యాశబ్దము వివాహితలయందుఁగూడ వర్తించును గనుకను, విధవావివాహము మనుస్మృతియందే విధింపఁబడినది గనుకను, చెడితిరిగెడివారికి మాత్రమే వివాహము లేదని మనువాక్యమున కర్థము చేయక తప్పదు.

శ్లో. సకృదంశో నిపతతి సకృత్కన్యా ప్రదీయతే
సకృ దాహ దదా నీతి త్రీణ్యేతాని సతాం సకృత్.

మను, అ. ౯, శ్లో ౪౭

భాగము వచ్చుటయు, కన్య నిచ్చుటయు, వస్తుదానమును, ఈ మూడును ఒక్కపర్యాయమే యని మనువు చెప్పుటవలన పునః కన్యాదానము కూడదనియు, అందుచేత స్త్రీపునర్వివాహము నిషిద్ధమనియు, నిషేధవాదులు పలుకుదురు. ఇది సామాన్యవచనము; ఒకరి కిచ్చిన కన్యను మఱియొకనికి సాధారణముగా నియ్యఁగూడ దను మాట వాస్తవమే కాని విశేషవిధులనుబట్టి నష్టత్వాదినిమిత్తముల యందుమాత్రము పునర్దానము చేయవచ్చునని శాస్త్రముచేతనే తెలుచున్నది. కాఁబట్టి నష్టత్వాదులయందు తప్ప కన్యను పునర్దానము చేయఁగూడ దని పయిశ్లోకమున కర్థ మగుచున్నది.

శ్లో. నోద్వాహికేషు మంత్రేషు నియోగః కీర్త్యతే క్వచిత్
న వివాహవిధా వుక్తం విధవాఽవేదనం పునః.

మను. అ. ౯ శ్లో. ౬౫

వివాహమంత్రములయందు నియోగ మెక్కడను జెప్పఁబడలే దనియు, వివాహవిధులయందు మరల విధవావివాహము చెప్పఁబడలే దనియు మనువు చెప్పెను గాన విధవావివాహము కూడ దని ప్రతిపక్షులు వాదింతురు. "వివాహోపయమౌ సమౌ తథా పరిణయోద్వాహోపయమాః పాణిపీడనమ్" అను నమరనిఘంటువును బట్టి వేదనపదము వివాహార్థబోధకముగాఁ గనుబట్టదు. వేదనపదము గ్రహించుట యనునర్థ మిచ్చు "విద్" ధాతువునుండి పుట్టిన విశేష్యమగుటచేత దానికి గ్రహణ మర్థము కాఁబట్టి పై వచనము విధవ నొకరు నియమించుట గాని యొకరు గ్రహించుట కాని వివాహమంత్ర

ములయందు లే దని చెప్పుచున్న దే కాని, యది విధవావివాహవిషయ మెంత మాత్రమును కాదు. ప్రకరణమునుబట్టి చూచినను, అది యంతయు నియోగవిషయమే కాని వివాహప్రసంగతిని చెప్పుట కావశ్యక మెంతమాత్రమును లేదు. వివాహప్రకరణములో వదలివేసి నియోగప్రకరణమధ్యమున నీ యొక్కమాటయు సందర్భము లేకుండ వివాహమంత్రములో విధవావివాహము లే దని చెప్పు ననుట యుక్తి యుక్తముగా కనుపట్టదు. వేదనశబ్దమునకు వివాహ మర్థము చేసెడు పక్షమున, సా చే దక్షతయోనిః స్యా దిత్యాది మనువచనమునకే యిది విరుద్ధ మగును. "ద్విజో విందేత దేవరః" అని మను వీ క్రియను నియోగమున గ్రహించుటయం దుపయోగించి యున్నాడు. ప్రకరణ సందర్భము తెలియుట కయి దాని పూర్వోత్తరశ్లోకముల నిం దుదాహరించుచున్నాను.

శ్లో. దేవరాద్వా సపిండాద్వా స్త్రియా సమ్యఙ్నియుక్తయా
ప్రజేప్సితాఽధిగంతవ్యా సంతానస్య పరిక్షయే. ౫౯
విధవాయాం నియుక్తస్తు ఘృతాక్తో వాగ్యతో నిశి
ఏక ముత్పాదయే త్పుత్రం న ద్వితీయం కథం చ న. ౬౦
ద్వితీయ మేకే ప్రజనం మన్యంతే స్త్రీషు తద్విదః
అనిర్వృతం నియోగార్థం పశ్యంతో ధర్మత స్తయోః. ౬౧
విధవాయాం నియోగార్థే నిర్వృత్తే తు యథావిధి
గురువచ్చ స్నుషావచ్చ వర్తేయాతాం పరస్పరమ్. ౬౨
నియుక్తౌ యౌ విధిం హిత్వా వర్తేయాతాం తు కామతః
తావుభౌ పతితౌ స్యాతాం స్నుషాగగురుతల్పగౌ. ౬౩
నాన్యస్మిన్ విధవా నారీ నియోక్తవ్యా ద్విజాతిభిః
అన్యస్మిన్ హి నియుంజానా ధర్మం హన్యు స్సనాతనం. ౬౪

నోద్వాహికేషు మంత్రేషు నియోగః కీర్త్యతే క్వచిత్
న వివాహవిధా వుక్తం విధవాఽఽవేదనం పునః. ౬౫

అయం ద్విజైర్హి విద్వద్భిః పశుధర్మో విగర్హితః
మనుష్యాణా మపి ప్రోక్తో వేనే రాజ్యం ప్రశాసతి. ౬౬

స మహీ మఖిలాం భుంజన్ రాజర్షి ప్రవరః పురా
వర్ణానాం సంకరం చక్రే కామోపహతచేతసః. ౬౭

తతఃప్రభృతి యో మోహాత్ ప్రమాతపతికాం స్త్రియం
నియోజయత్యఽపత్యార్థం తం విగర్హంతి సాధవః. ౬౮

మనుస్మృతి నవమోధ్యాయమునందలి పై శ్లోకములవలన నిది యంతయు నియోగప్రకరణ మగుట స్పష్టమే. "నాన్యస్మిన్ విధవా నారీ" మొదలుకొని యైదుశ్లోకములును ప్రక్షిప్తము లనియు, ఈ శ్లోకములు పూర్వ మవ్యవధానముగా మనువు చెప్పినదానికే విరుద్ధముగా నున్నవనియు, విధవావివాహము శాస్త్రనిషిద్ధ మని సాధించుట కెవ్వరో వీనిని కల్పించి మధ్య నిమిడ్చి యుందురనియు, ఇవి మనువచనములే యైనయెడల మనువు తరువాత తొమ్మిదితరములు దాటి ప్రభుత్వమునకు వచ్చిన వేనుఁడు తనకు పూర్వమే రాజ్యము చేసి నియోగమును వ్యాపింపఁ జేసి వర్ణసాంకర్యమును గలుగఁజేసె ననుట తటస్థింపదనియు కొందఱభిప్రాయపడుచున్నారు.

విధవావివాహఖండనవాదులు విధవోద్వాహముతో దూర సంబధమైనను లేని యీ నాలుగుదుర్బలవచనములను సాధనములుగా జేసికొని పోరాడి కంఠోక్తిగా స్త్రీపునర్వివాహమును విధించుచున్న బలవత్తరము లయిన యనేక శ్రుతిస్మృతివచనములను ఖండించి తమ వాదమును స్థాపింపఁ జూచుచున్నారు.

పురాణ ప్రమాణములు;

ఇంక పురాణములయందు స్త్రీపునర్వివాహవిషయమునఁ గను పట్టు ప్రమాణములను యోచింతము.

౧. అగ్నిపురాణము.

శ్లో. నష్టే మృతే ప్రవ్రజితే క్లీబే చ పతితే పతౌ
పంచస్వాపత్సు నారీణాం పతి రన్యో విధీయతే.
మృతే తు దేవరే దేయా తదభావే యథేచ్ఛయా.

పయివచనము నష్టత్వాది పంచాపదలయందును స్త్రీలకు మఱి యొక పతి విధింపఁబడుచున్నాఁ డనియు, మృతుఁ డయినప్పుడు మొదట దేవరునకును, దేవరుఁడు లేనప్పుడు మనసువచ్చిన వారికిని స్త్రీ నియ్యఁ దగు ననియు స్పష్టముగా చెప్పుచున్నది.

౨. బ్రహ్మపురాణము.

శ్లో. మృతే భర్తరి యా నారీ త్యక్తవత్యథా తం స్వయమ్
సవర్ణా జనయే ద్గర్భం భర్తుః పౌనర్భవం సుతమ్.
యది సా బాలవిధవా బలా త్త్యక్తాఽథవా క్వచిత్
తథా భూయస్తు సంస్కార్యా గృహీత్వా యేన కేన చిత్.

ఇందలి మొదటిశ్లోకము విధవగాని భర్తచే విడువఁబడినదిగాని స్వయముగా సవర్ణునివలన బిడ్డను గన్నపక్షమున నట్టి సుతుఁడు భర్తకు పౌనర్భవపుత్రుఁ డగునని పౌనర్భవలక్షణమును చెప్పుచున్నది. అట్టి స్త్రీ బాలవిధవగాని బలవంతముగా మగనిచే విడిచిపెట్టఁబడినదిగాని యయినపక్షమున మనసువచ్చిన వానిని వివాహము చేసికొనుట కర్హురా లగుచున్నదని రెండవశ్లోకము పునర్వివాహానుజ్ఞ నిచ్చుచున్నది.

౩. భా ర త ము.

శ్లో. అర్జున స్యాత్మజః శ్రీమా న్నిరావ న్నామ వీర్యవాన్
సుతాయాం నాగరాజస్య జాతః పార్థేన ధీమతా
ఐరావతేన సా దత్తా హ్యనపత్యా మహాత్మనా
పత్యౌ హతే సుపర్ణేన కృపణా దీనచేతనా
భార్యార్థం తాం చ జగ్రాహ పార్థః కామవశానుగాం.

*　　*　　*　　*

అజాన న్నర్జున శ్చాపి నిహతం పుత్ర మౌరసం
జఘాన సమరే శూరాన్ రాజ్ఞ స్తాన్ భీష్మరక్షిణః.

భీష్మపర్వము

ఈ శ్లోకములు పూర్వోక్తపురాణవచనములవలె స్త్రీపునర్వివాహము శాస్త్రసమ్మత మని మాత్రమే తెలుపక సుపర్ణునిచేత భర్త చంపఁబడిన తరువాత ఉలూపిని మరల నర్జునుఁడు వివాహము చేసికొనుటను మృతభర్తృక యయిన యులూపిని తండ్రి యైన నాగరాజే మరల దానము చేయుటను పునర్వివాహ మాడిన యువతికి పుట్టిన పుత్రుఁడు ఔరసుఁడే యనుటను కూడ తెలిపి సరిగా స్త్రీ పునర్వివాహ ముత్తమవంశమునందు జరగిన సంగతినికూడ స్థాపించుచున్నది.

శ్లో. అస్థాస్యతి పునర్భైమీ దమయంతీ స్వయంవరమ్
తత్ర గచ్ఛంతి రాజానో రాజపుత్రాశ్చ సర్వశః.

ఆదిపర్వము.

నలుఁడు నష్టుఁ డయినప్పు డాతనిని కనుఁగొనుట కయి దమయంతి సుదేవుఁ డను బ్రాహ్మణుని ఋతుపర్ణునొద్దకుఁ బంపు నప్పుడు దమయంతీ పునస్స్వయంవరము జరగఁబోవు ననియు, అందు

నిమిత్తమయి యందఱు రాజులును రాజపుత్రులును వచ్చుచున్నా రనియు ఋతుపర్ణునితోఁ జెప్పుటకయి నియమించెను. పోయినభర్తను వెదకి కనుఁగొనుటకయి పతివ్రతాశిరోమణియైన దమయంతి తనకు పునస్స్వయంవరమని బహిరంగముగా రాజసభకుఁ జెప్పఁబంపుటయు, ఆ వార్త విన్నతోడనే లేశ మయినను సంశయింపక రాజర్షి యైన ఋతుపర్ణు నంతటివాఁడు వెంటనే బయలుదేఱి వచ్చుటయు, ఆ యుపాయము సుదేవునకుఁగాని దమయంతియొక్క జననీజనకులకుఁగాని మఱియెవ్వరికిఁగాని వింతగా తోఁచకపోవుటయు, విచారింపగా పూర్వకాలమునందు స్త్రీపునర్వివాహము సర్వధారణముగా నడుచుచు వచ్చెననియు నట్టి ద్వితీయవివాహ మేవిషయమునందును ప్రథమవివాహమునకంటె క్రొత్తగా తోఁచకుండె ననియు విదితమగుచున్నది.

౮. పద్మపురాణము.

శ్లో. సతాం దృష్ట్వా దివోదాసో దివ్యా దేవీం సుతాం తదా
కస్మై చ దీయతాం కన్యాం సువరాయ మహాత్మనే.
ఇతి చింతాతురో భూత్వా సమాలోక్య నరోత్తమః
యూపదేశస్థ రాజానం సమ్యక్ జ్ఞాత్వా మహీపతిః.
చిత్రసేనం మహాత్మానం సమాహూయ తతో నృపః
కన్యాం దదౌ దివోదాస శ్చిత్రసేనాయ ధీమతే.
తస్యా వివాహకాలస్య సంప్రాప్తే సమయే నృప
మృతోఽసౌ చిత్రసేనస్తు కాలధర్మేణ వై కిల.
దివోదాస శ్చ ధర్మాత్మా చింతయామాస భూపతిః
బ్రాహ్మణానాం సమాహూయ పప్రచ్ఛ నృపనందనః.

అస్యా వివాహకాలే తు చిత్రసేనో దివం గతః
అస్యాస్తు కీదృశం కర్మ భవిష్యతి బ్రువంతు మే.

బ్రాహ్మణా ఊచుః.

శ్లో. వివాహే జాయతే రాజన్ కన్యాయా స్తే విధానతః
పతి ర్మృత్యుం ప్రయాత్యేవ యో వా త్యాగం కరోతి చ.
మహాధివ్యాధినా భూత స్త్యాగం కృత్వా ప్రయాతి చ
ప్రవ్రాజితో భవే ద్రాజన్ ధర్మశాస్త్రేషు దృశ్యతే.
తస్యాం రజస్వలాయాం చ పతి రన్యో విధీయతే
వివాహం తు విధానేన పితా కుర్యా న్న సంశయః.
ఏవం రాజన్ సమాదిష్టం ధర్మశాస్త్రం శుభై ర్జనైః
వివాహ క్రియతా మస్యా ఇత్యూచు స్తే ద్విజోత్తమాః.
దివోదాసస్తు ధర్మాత్మా బ్రాహ్మణై స్సంప్రచోదితః
వివాహార్థం మహారాజా మానసం కృతవా న్నృపః.
పున ర్దత్తా తదా తేన దివ్యా దేవీ ద్విజోత్తమ
పుణ్యసేనాయ పుణ్యాయ తస్మై రాజ్ఞే మహాత్మనే.
మృత్యుధర్మగతో రాజా వివాహసమయేఽపి సః
యదా యదా మహాభాగో దివ్యా దేవ్యా స్సభూమిపః.
కరోతి సతతోద్యోగం వివాహాయాఽతిదుఃఖితః
భర్తాఽపి మ్రియతే కాలే ప్రాప్తలగ్న స్తదా తదా.
ఏకవింశతి భర్తారః కాలే కాలే మృతా స్తథా
తతో రాజా మహాదుఃఖ సంజాతః ఖ్యాతవిక్రమః.

చిత్రోపాఖ్యానము; సప్తమోధ్యాయము

ఈ పయివాక్యములవలన కాశీరాజైన దివోదాసుఁడు తన కొమార్తెకు భర్తపోయినప్పుడెల్లను మరలమరల వివాహముచేయుచు

వచ్చెనని తెలియుటయేకాక పతి మృత్యుగతుం డౌట మొదలుగాం గల యాపదలయందు రజస్వలలకు సహితము పునర్వివాహ మొనర్చుట శాస్త్రసిద్ధాంత మని నిరాక్షేపముగా నేర్పడుచున్నది. వివాహ సమయమునందు పతి మృతుం డయ్యెనని యుండుటచేత భర్తలు సప్తపదికి పూర్వమే మృతు లగుచువచ్చిరని కొందఱు వాదింపం జూతురుగాని, "కన్యాం దద్యా" "పునర్దత్తా" "భర్తా" "ప్రాప్తలగ్నః" మొదలగుపదములు నిస్సందేహముగా భర్తలు వివాహదినములలో సప్తపద్యనంతరమే మృతులగుచు వచ్చిరనుటను స్థాపించుచున్నవి.

ఈ పూర్వోదాహృత సమస్తవచనములనుబట్టి చూచిన పక్షమున మందుండయినను శ్రుతిస్మృతిపురాణేతిహాసములు నిస్సంశయముగా స్త్రీపునర్వివాహమును సిద్ధాంతపఱుచుచున్న వని తెలిసికొనవచ్చును. ఇందువలన స్త్రీపునర్వివాహము శాస్త్రసమ్మతమనుట మాత్రమే కాక క్రమముగా నట్టివివాహములు నడుచుచు వచ్చెననియు బృహస్పతి పార్థుండు దివోదాసుండు మొదలుగాంగల పుణ్యపురుషులు సహితము స్త్రీపునర్వివాహమును చేసికొనుటకును చేయించుటకును వెనుకతీయ లేదనియు తేటపడుచున్నది.

కలియుగస్మృతి ప్రమాణములు.

స్త్రీపునర్వివాహమునకు సాధకముగా శ్రుతిస్మృతిపురాణముల నుండి యిట్లన్నివచనముల నుదాహరించినను, అవు నివి యన్నియు ననుకూలముగానే యున్నవి కాని యివి కలియుగధర్మైకబోధకములు కావు కాంబట్టి, కలియుగమునందు స్త్రీపునర్వివాహము కర్తవ్యమని చూపునఱకు నివి ప్రయోజనకరములు కావని నిషేధవాదు లొక్కమాట యనవచ్చును. కలియుగధర్మైకబోధకమగు పరాశరస్మృతి నుండి స్త్రీపునర్వివాహము నిషిద్ధమని యొక్క వచనమును ప్రతి

పక్షులు చూపఁగలుగుదురేని, ఈ పడినప్రయాస యంతయు వ్యర్థమగును. కాఁబట్టి విధాయకవాదులు తమ పక్షమును స్థిరపఱుచుకొనుటకయి పరాశరస్మృతియం దట్టి నిషేధము లేదని యయినను స్థాపింపవలసి యున్నది. అట్లుగాక విధాయకవాదు లిప్పుడు పరాశరస్మృతియం దట్టినిషేధ మేదియు లేదని చూపఁగలిగినవారు మాత్రమే కాక స్త్రీపునర్వివాహము చేయవచ్చు నన్న స్పష్టమయిన విధినిగూడ గనఁబఱిచి తమవాదమును నిరాక్షేపముగా సాధింపఁగలిగిన స్థితియందు కూడ నున్నారు.

పరాశరస్మృతి చతుర్థాధ్యాయములో

శ్లో. నష్టే మృతే ప్రవ్రజితే క్లీబే చ పతితే పతౌ
పంచస్వాపత్సు నారీణాం పతి రన్యో విధీయతే.

పతి నష్టుఁడైనను, మృతుఁడైనను, సన్యసించినను, నపుంసకుఁడయినను, పతితుఁడయినను, స్త్రీల కీయైదాపదలయందును మఱియొకపతి విధింపఁబడుచున్నాఁడని స్పష్టమైన విధి కనఁబడుచున్నది. ఈ వాక్యముయొక్కసందర్భము తెలియుటకయి పూర్వోత్తరశ్లోకముల నిం దుదాహరించుచున్నాను,—

శ్లో. జ్యేష్ఠభ్రాతా యదా తిష్ఠే దాధానం నైవ కారయేత్
అనుజ్ఞాతస్తు కుర్వీత శంఖస్య వచనం యథా. ౨౭
నష్టే మృతే ప్రవ్రజితే క్లీబే చ పతితే పతౌ
పంచస్వాపత్సు నారీణాం పతి రన్యో విధీయతే. ౨౮
మృతే భర్తరి యా నారీ బ్రహ్మచర్యే వ్రతే స్థితా
సా మృతా లభతే స్వర్గం యథా తే బ్రహ్మచారిణః. ౨౯
తిస్రః కోట్యర్థకోటీ చ యాని లోమాని మానుషే
తావత్కాలం వసేత్స్వర్గే భర్తారం యాఽనుగచ్ఛతి. 30

పరాశరుఁడు వివిధధర్మములను జెప్పుచు మొదట పరివేదనము కూడదని చెప్పి తరువాత ౨౭ వ శ్లోకముచేత జ్యేష్ఠభ్రాత బ్రతికి యుండఁగా తమ్ముఁడు యజ్ఞము చేయఁగూడదనియు అనుజ్ఞ పుచ్చుకొని చేయవలయుననియు చెప్పి, పిమ్మట మృతభర్తృకాదివిషయము నెత్తుకొని ౨౮ వ శ్లోకముచేత నష్టత్వాద్యాపదలయందు స్త్రీపునర్వివాహము చేసికోవచ్చునని విధించి, ౨౯ వ శ్లోకము చేత భర్త మృతుఁడయిన స్త్రీ బ్రహ్మచర్యము చేసినపక్షమున మరణానంతరము స్వర్గమును పొందునని చెప్పి, 30 వ శ్లోకముచేత సహగమనము చేసిన స్త్రీ మనుష్యశరీరముమీఁద నెన్నిరోమము లుండునో యన్నిసంవత్సరము లనఁగా మూఁడుకోట్ల యేఁబదిలక్షలసంవత్సరములు స్వర్గమున వసించునని చెప్పినాఁడు. ఈ పునర్వివాహము పరివేదినుల కని యొకరును, వాగ్దత్తల కని మఱియొకరును, నియోగపర మని యింకొకరును వ్రాసియున్నారు. ప్రకరణమునుబట్టికాని శబ్దశక్తి చేతఁగాని యట్టి యర్థము వచ్చుట కవకాశము లేదు. వివాహము వాగ్దత్తల కయినపక్షమున ప్రకరణమునుబట్టి బ్రహ్మచర్యమును సహగమనమునుకూడ వాగ్దత్తలకే యయి పరిహాసాస్పద మయిన యర్థమేర్పడును. కొంద ఱీవిధి ద్విజులకు కాదని వాదించిరికాని మూల వాక్యములోని "ప్రవ్రజితే" శబ్దము వారిని బాధించునుగాన సన్న్యాసము ద్విజులకే యని తెలిసికొని వారూరకుండవలసినవా రగుచున్నారు. ఇంకొకరు పతి యనఁగా రక్షకపతి యని రెండవ పతిశబ్దమున కర్థముచేయ యత్నించినారు; మూలములో "క్లీబే" యను పద ముండుటచేత నపుంసకుఁడు తనభార్యను రక్షించుటకు సమర్థుఁడు కాకపోఁడు గనుక వారియర్థము వ్యర్థము. మఱియొకరు "పతౌ" యను పదము వ్యాకరణదుష్టముగ కనఁబడుచున్నది. గనుక, 'అపతౌ' యని

పూర్వార్థమున పదవిభాగము చేసి పర్యుదాసముచేత దానికి పతిసదృశుడును పతిభిన్నుఁడు ననఁగా వాగ్దత్తాపతి యని యర్థము చేయవలెనసిరి. ఉత్తరార్థమున "పతి రన్యః" అని మఱియొకపతిని విధించుటను బట్టి "అన్య" పదస్వారస్యముచేత మొదటివాఁడు పతియైనంగాని రెండవవాఁ డన్యపతి కానేరఁడు కాఁబట్టి మొదటిది 'పతి' శబ్దమేకాని 'అపతి' శబ్దము కాదు. నియోగపర మని వాగ్దత్తాపర మని యర్థము చేయువారినికూడ ఈ 'యన్య' పదమే బాధించును. కొందఱు 'పతౌ' యనుదానికే గౌణపతి యని యర్థము చేయ యత్నించిరి కాని,

శ్లో. నోదకేన న వా వాచా కన్యాయాః పతి రుచ్యతే
పాణిగ్రహణసంస్కారా త్పతిత్వం సప్తమే పదే.

అను నారదవచనమును బట్టియు,

శ్లో. నోదకేన న వా వాచా కన్యాయాః పతి రుచ్యతే
ప్రాణిగ్రహణసంస్కారో నియతం పతిలక్షణమ్.

అను పరాశరవచనమునుబట్టియు, సరిగా పాణిగ్రహణము చేసినవాఁడే పతి యగును గనుక మఱి యే యర్థమును పొసఁగదు. మనోరమా, తత్వబోధినీ వ్యాఖ్యానములయందు "పతౌ" యను రూపము సాధువుగానే చేయఁబడియున్నది. అంతియకాక యిది యార్షప్రయోగ మగుటచేత నిక్కడ నట్టి వివాదముతో పనియే లేదు.

౧. శీతాయాః పతయే నమః—రామాయణము.

౨. క్రీడతే పతినా సార్థం యావదింద్రా శ్చతుర్దశ—హారీతస్మృతి.

3. సమాంశభాగినీ మాతా పుత్రాణాం సా స్మృతే పతౌ.
నారదస్మృతి.

మొదలుగాఁగల యార్షప్రయోగములు పెక్కులు కనఁబడుచుండుటచేత 'పతౌ' పదము దుష్టమును గాదు; దానికి మఱియొక

యర్థము చేయ నావశ్యకమును లేదు. మాధవాచార్యులవారు వ్యాఖ్యానములో 'నష్టే మృతే' యనునది స్త్రీపునర్వివాహపరమని యొప్పుకొని యీ వచనమును యుగాంతరవిషయమునుగాఁ జెప్పి తమ వాక్యమున కుపబలముగా,—

శ్లో. ఊఢాయాః పునరుద్వాహం జ్యేష్ఠాంశం గోవధం తథా
కలౌ పంచ న కుర్వీత భ్రాతృజాయాం కమండలుమ్.

అను ఆదిపురాణవచనము నుదాహరించి యున్నారు. పరాశరుఁడే కలియుగమున కని చెప్పిన విధిని మూలవిరుద్ధముగా నితర యుగమునకన్న వ్యాఖ్యానము గ్రాహ్యము కానేరదు. గనుకను స్మృతికంటె పురాణ మెప్పుడును దుర్బలమయిన దగుటచే నాది పురాణవచనము పరాశరస్మృతిని బాధింపఁజాలదు గనుకను, కలియుగమున స్త్రీపునర్వివాహ మాచరణీయమే యగును. అదిగాక పురాణవచనము "ఊఢాయాః పునరుద్వాహ" మని సామాన్యముగా వివాహితకు పునర్వివాహము కలినిషిద్ధ మని చెప్పుచున్నది; పరాశర స్మృతి యన్ననో విశేషముగా నష్టత్వాదులయిన యయిదాపదల యందు మాత్రమే స్త్రీలకు పునర్వివాహమును విధించుచున్నది. కాఁబట్టి స్మృతి పురాణవచనమున కెంతమాత్రమును విరోధముగా నుండక యుత్సర్గాపవాద న్యాయమున నాపత్పంచకమునందు మాత్రము పునరుద్వాహమును సిద్ధాంతీకరించుచున్నది. అందుచేత రెంటికి సమన్వయము చేసినయెడల నష్టత్వాద్యాపత్పంచకమునందు తప్ప నారీపునర్వివాహము కూడదన్న సిద్ధాంత మేర్పడుచున్నది. కలియుగనిషేధ మన్నతోడనే పూర్వయుగములయం దున్న దానిని దేనినో నిషేధింపవలయును గనుక, పయిపురాణవచనము పూర్వ

యుగములయం దున్న పునర్వివాహములను వేసిని నిషేధించుచున్న దని కొందఱు శంక చేయవచ్చును. "వరశ్చే త్కులశీలాభ్యాం" మొదలగు పూర్వోదాహృత వచనములనుబట్టి వరుఁడు మంచివాఁడు దొరకినపక్షమున వివాహితను మరల మఱియొకని కిచ్చి వివాహము చేయవలయునన్న విధులనుమాత్రమే కలియుగమునందు పయిపురాణ వచనము నిషేధించుచున్నది. ఈ యొక్కవచనముమాత్రమే కాక కలినిషేధములనుగూర్చి చెప్పెడి పురాణవచనము లన్నియు నీ ప్రకార ముగానే, యిచ్చిన కన్యను మరల నియ్యఁగూడ దని సామాన్యముగానే చెప్పుచున్నవి.

౨. శ్లో. సముద్రయాత్రా స్వీకారః కమండలు విధారణమ్
ద్విజానా మసవర్ణాసు కన్యాసూపయమ స్తథా.
దేవరాచ్చ సుతోత్పత్తి ర్మధుపర్కే పశోర్వధః
మాంసదానం తథా శ్రాద్ధే వానప్రస్థాశ్రమ స్తథా.
దత్తాయాశ్చైవ కన్యాయాః పునర్దానం వరస్యచ
దీర్ఘకాల బ్రహ్మచర్యం నరమేధాశ్వమేధకౌ.
మహాప్రస్థానగమనం గోమేధశ్చ తథా మఖమ్
ఇమాన్ ధర్మాన్ కలియుగే వర్జ్యానాహుర్మనీషిణః.

బృహన్నారదీయము.

3. శ్లో. దేవరాచ్చ సుతోత్పత్తి ర్దత్తాకన్యా ప్రదీయతే
న యజ్ఞే గోవధం కార్యః కలౌ న చ కమండలుః.—క్రతువు.

౪. శ్లో. దీర్ఘకాలం బ్రహ్మచర్యం ధారణశ్చ కమండలోః
దేవరేణ సుతోత్పత్తి ర్దత్తా కన్యా ప్రదీయతే.
కన్యానా మసవర్ణానాం వివాహశ్చ ద్విజాతిభిః
ఆతతాయి ద్విజాగ్ర్యాణాం ధర్మ్యయుద్దే న హింసనమ్.

వానప్రస్థాశ్రమస్యాపి ప్రవేశో విధిదేశితః
వృత్తస్వాధ్యాయసాపేక్ష మఘసంకోచనం తథా.
ప్రాయశ్చిత్తవిధానంచ విప్రాణాం మరణాంతికమ్
సంసర్గదోష పాపేషు మధుపర్కే పశోర్వధః.
దత్తౌరసేతరేషాన్తు పుత్రత్వేన పరిగ్రహః
శూద్రేషు దాసగోపాల కులమిత్రార్థసీరిణామ్.
భోజ్యాన్నతా గృహస్థస్య తీర్థసేవాతిదూరతః
బ్రాహ్మణాదిషు శూద్రస్య పక్వతాదిక్రియాపిచ.
భృగ్వగ్ని పతనశ్చైవ వృద్ధాది మరణం తథా
ఏతాని లోక గుప్త్యర్థం కలే రాదౌ మహాత్మభిః
నివర్తితాని విద్వద్భి ర్వ్యవస్థాపూర్వకం బుధైః.

ఆదిత్యపురాణము.

ఇట్లు డుదాహరింపఁబడినవానిలో (ఊఢాయాః పునరుద్వాహమ్) వివాహితకు మరల వివాహమని యాదిపురాణములోను, (దత్తాయాశ్చైవ కన్యాయాః పునర్దానం వరస్య చ) దత్తయైన కన్యను వరునకు మరల దానముచేయుట యని బృహన్నారదీయ పురాణమునందును, (దత్తా కన్యా ప్రదీయతే) దత్తయైన కన్య యియ్యఁబడుట యని క్రతువచనమునందును, (దత్తా కన్యా ప్రదీయతే) దత్తయగు కన్య యియ్యఁబడుచున్నదని యాదిత్యపురాణమునందును, సామాన్యముగా నొకసారి యియ్యఁబడిన కన్య మరల నియ్యఁబడఁ గూడదని చెప్పఁబడినదే కాని పరాశరస్మృతియందువలె నిందొకదానియందును విశేషాపత్తుల విషయమయి చెప్పఁబడి యుండలేదు. స్త్రీపునర్వివాహ విధాయక వాదులు సహితము పూర్వోక్తపురాణములవలెనే సామాన్యముగా వివాహితకు మరల వివాహము చేయఁగూడదనియు దానము

చేయఁబడిన కన్యలను మరల దానము చేయఁగూడదనియునే చెప్పు దురు. కాని వారు పరాశరుఁడు చెప్పిన యాపత్సనుయములయందు మాత్రము విశేషవిధిచేత శ్రీపునర్వివాహము కూడునందురు.

ఈ వాదము నటుండనిచ్చి సత్యమెట్లున్నను ప్రతిపక్షులకే సమస్తవిధముల లాభమును గలుగఁజేసి స్మృతికంటె పురాణమే బల మయినదనియు విశేషసామాన్యభావము లేదనియు పురాణవచనము లన్నియు విధవావివాహమునే కలియుగమునందు నిషేధించుచున్న వనియు క్షణకాల మంగీకరించినను ఇఁక ముప్పదియొక్క వేల సంవత్స రములనాటికిఁగాని యీవిషయములకు చెల్లుబడియే కలుగదు. ఎట్లనిన,—

శ్లో. చత్వార్యాహుః సహస్రాణి వర్షాణాంతు కృతం యుగమ్
తస్య తావచ్ఛతీసంధ్యా సంధ్యాంశశ్చ తథావిధః. ౬౯
ఇతరేషు ససంధ్యేషు ససంధ్యాంశేషు చ త్రిషు
ఏకాపాయేన వర్తంతే సహస్రాణి శతాని చ. ౭౦

మనుస్మృతి ప్రథమోధ్యాయమునందలి పయి శ్లోకములవలన కృతయుగ పరిమాణము నాలుగువేల దివ్యసంవత్సరములనియు దానికి సంధ్య నాలుగువందల దివ్యసంవత్సరములును సంధ్యాంశము నాలుగు వందల దివ్యసంవత్సరములు నుండుననియు, తక్కిన యుగములును క్రమముగా సంధ్యాసంధ్యాంశలతోఁగూడ నొక్క వేయిసంవత్సరముల చొప్పునను వందసంవత్సరముల చొప్పునను తక్కువగా నుండు ననియు స్పష్టపడుచున్నది. దీనినిబట్టి చూడఁగా సంధ్యాసంధ్యాంశలు గాక మిగిలియున్న మధ్యకాలమే క్రమమయినయుగమని తేటపడు చున్నది.

శ్లో. కృతం త్రేతా ద్వాపరశ్చ కలిశ్చేతి చతుర్యుగమ్
దివ్యై ర్ద్వాదశభి ర్వర్షై స్సావధానం నిరూపితమ్. ౭౧

చత్వారి త్రీణి ద్వే చైకం కృతాదిషు యథాక్రమమ్
సంఖ్యాతాని సహస్రాణి ద్విగుణాని శతాని చ. ౧౯

సంధ్యాసంధ్యాంశయో రంత ర్యత స్సర్గో యతో లయః
తమే వాహు ర్యుగం తద్జ్ఞా యత్ర ధర్మో విధీయతే. ౨౦

శ్రీమద్భాగవతము తృతీయస్కంధము ఏకాదశాధ్యాయము నందలి పయి శ్లోకములనుబట్టి కృత త్రేతా ద్వాపర కలియుగము లన్నియుఁ గలిసి పండ్రెండువేల దివ్యసంవత్సరములు కలవనియు, అందు నాలుగువేల యెనిమిదివందల దివ్యసంవత్సరములు కృతయుగ మనియు, మూఁడువేల యాఱువందల దివ్యసంవత్సరములు త్రేతాయుగ మనియు, రెండువేల నాలుగువందల దివ్యసంవత్సరములు ద్వాపరయుగ మనియు, పండ్రెండువందల దివ్యసంవత్సరములు కలియుగమనియు, యుగాదికాలము సంధ్యయనియు, యుగాంతరకాలము సంధ్యాంశ మనియు, ఆ యా యుగధర్మములు విధింపఁబడెడు కాలము సంధ్యా సంధ్యాంశల నడిమిభాగమగు క్రమమయిన యుగము మాత్రమే యనియు స్పష్టమగుచున్నది. పూర్వోదాహృత మనుస్మృతివచనముల వలనను, "క్రమాత్కృత యుగాదీనాం షష్ఠాంశ స్సంధ్యయో స్స్వకః" ఇత్యాద్యార్యభటసిద్ధాంతవచనమువలనను, కలియుగమునందు నూఱు దివ్యవర్షములు సంధ్యగాను నూఱుదివ్యవర్షములు సంధ్యాంశముగాను నేర్పడుచున్నవి. ఒక దివ్యవర్షమునకు మన సంవత్సరములు మూఁడు వందలయిరువది యగును గనుక కలియుగప్రమాణము ౪,౩౨,౦౦౦ సంవత్సరములలో సంధ్యాకాలము మొదటి ముప్పదియాఱువేలసంవ త్సరములుగా నుండును. పయి భాగవతపురాణ ప్రమాణమునుబట్టి పూర్వోక్తములయిన కలినిషిద్ధధర్మములన్నియు కలియుగ మారంభ మయిన ముప్పదియాఱువేల సంవత్సరముల కనఁగా నీవలఁ కించుమిం

చుగా గతించిన యైదువేలసంవత్సరములును గాక యింక- ముంకు ముప్పదిరెండ్ల-వేల సంవత్సరములు దాటిన తరువాతనే వ్యవహారము నకు రావలయును కాఁబట్టి ప్రతిపక్షుల కలినిషేధములును వారి కిప్పు డేవిధమునను సాహాయ్యము చేయఁజాలవు. పూర్వోదాహృతము లయిన భాగవత శ్లోకములలో కడపటిదానికి వ్యాఖ్యానము చేయుచు శ్రీధరాచార్యులవారు,—

"యుగస్యాదౌ సంధ్యా, అంత్యే తు సంధ్యాంశః తయోరంత రం (తయోర్మధ్య ఇత్యర్థః) యుగస్వరూపం వేదితవ్య మిత్యాహుః- సంధ్యాసంధ్యాంశయో ర్విశేషమాహ - యత స్సర్గో యతో లయ ఇతి- తత్తద్యుగేన కర్మకృతఫలభోగినాంచ ప్రాణినాం, యతో యత్ర సర్గ ఉత్పత్తిః, సా యుగస్యసంధ్యా - తేషాం, యతో యత్ర లయో నాశః స సంధ్యాంశ ఇతి- తన్మధ్యపతితయుగస్య విశేష మాహ- యత్ర ధర్మో విధీయత ఇతి-యత్ర గవాలంభనాది ధర్మవిశేషో విధీయత్తే, తద్ జ్ఞాః, తదభిజ్ఞాః, తమేవ యుగమాహుః- సాధారణధర్మస్తు సంధ్యా సంధ్యాం శయో రప్య స్త్యేవ."

అని గవాలంభనాది కలినిషేధములు సంధ్యాసంధ్యాంశముల నడిమి భాగమయిన క్రమమయిన యుగమునందు మాత్రమే చెల్లు ననియు సాధారణ ధర్మములే సంధ్యాసంధ్యాంశములలో నడుచు ననియు వివరముగా తెలిపియున్నారు. క్రమమయిన కలియుగము వచ్చిన తరువాత సహితము మనుష్యకృతము లయిన పూర్వోక్త కలి నిషేధవచనములు దేవదత్తములయిన వేదవాక్యములను ఋషి ప్రోక్తము లయిన స్మృతివాక్యములను బాధింపఁజాలవని యీ వఱకే సప్రమాణముగా స్థాపించి యున్నాను. ప్రాచీను లేర్పఱుచుకొన్న కట్టు పాటులే శ్రుతిస్మృతులను బాధింపఁ గలిగిన పక్షమున దేశకాలాను

సారముగా నాకట్టుపాట్ల నిప్పటివా రేల మార్చుకొనరాదో నే నూహింపఁజాలకున్నాను.

శ్లో. పరిత్యజే దర్థకామౌ యౌ స్యాతాం ధర్మవర్జితౌ
ధర్మం చా ప్యసుఖోదర్కం లోకవిక్రుష్ట మేవ చ.
మను, అ-౪, శ్లో. ౧౭౬.

అని మనువే లోకమునకు అసుఖమును బాధకరము నైన ధర్మమును సహితము త్యజింపవలెనని యనుజ్ఞ యిచ్చి యున్నాఁడు గాన పూర్వపు పెద్దలు శాస్త్రానుసారముగానే దేశకాలపాత్రతను విచారించి యట్టి సమయము నేర్పఱచుకొని యున్నారనెడు పక్షమున ఆ మనువచనము పూర్వపువారి కట్టుపాటును మనము మీఱకూడదని విధించుట కనుకూలపడదు. గాని యిప్పటి దేశకాల స్థితినిబట్టి మనము సహితము తగిన మార్పులను చేసికోవచ్చుననియు పూర్వమేదో బాధ సంభవించినందువల్ల తత్కాలానుగుణముగా తొంటి పెద్ద లట్టి కట్టును జేసికొని యుందురనియు తెలిసికొనుటకు మాత్రమే యక్కఱకు వచ్చుచున్నది. శ్రుతి స్మృతి పురాణేతిహాసముల యందింత బలముగా విధింపఁబడిన స్త్రీపునర్వివాహము నిలిచిపోవుటకు కారణ మేమయి యుండునో తెలిసికోవలె నని పలువుర కభిలాష యుండవచ్చును. గనుకను, ఆ కారణము నూహించుటకు పూర్వోదాహృతములయిన కలి నిషేధవచనములు కొంత తోడుపడును గనుకను, ఆ విషయమయి నా యభిప్రాయమును సంగ్రహముగా తెలిపెదను.

శ్లో. ఏతాని లోక గుప్త్యర్థం కలే రాదౌ మహాత్మభిః
నివ ర్తితాని విద్వద్భి ర్వ్యవస్థాపూర్వకం బుధైః.

అను పూర్వోదాహృతమయిన యాదిత్యపురాణవచనమును బట్టి పయి కలినిషేధములన్నియు లోకరక్షణార్థమయి కలియుగాది

యందు మహాత్ములును విద్వాంసులు నగు పెద్దలచేత వ్యవస్థాపూర్వకముగా నివర్తింపఁబడినట్టు స్పష్టమగుచున్నది. ద్వాపరాంతము వఱకును స్త్రీపునర్వివాహము లవిచ్ఛిన్నముగా నడుచుచు వచ్చెననుట కర్జునుఁడు విధవయైన యులూపిని పరిణయ మగుటయే చాలినంత నిదర్శనముగా నుండును. ద్వాపరాంతమువఱకును జరిగిన వివాహముల నంత-శీఘ్రముగా కలియుగాదియందే నిలుపుటకు తగినంత దేశోపద్రవ మప్పు డేది కలిగినదని విచారింపఁగా, ఆ యుపద్రవము భారతయుద్ధముగాఁ గనఁబడుచున్నది. భారతయుద్ధమునందు హిందూదేశము నందుఁగల రాజులందఱును తమ సైన్యములతో నేదోయొక కక్షిని జేరి యుద్ధము చేసినట్టును, పదునెనిమిదక్షౌహిణుల బలము నాశము చెందినట్టును, భారతమును జదివినవారి కందఱికిని తెలిసి యుండును. కౌరవ పక్షమున సేనాధిపతులుగా నుండిన ద్రోణకృపాశ్వత్థామలను బట్టి యుభయసైనికులలోను పలువురు బ్రాహ్మణులు సహిత ముండి యుందురు. యుద్ధము చేసెడివారు బాలురును వృద్ధులునుగా నుండక సాధారణముగా వయస్సులో నున్నవారుగానే యుందురు గనుకను, అన్నిజాతులలోను లక్షలకొలఁది జనులు రణనిహతు లయిరి గనుకను, అన్నిజాతులలోను లక్షలకొలఁది వయస్సులో నున్న స్త్రీలు ఏకకాలమునందు విధవలయియుందురు. అందఱు పురుషులు ఏకకాలమునందు మృతులయి యుండుటచేత హిందూదేశమునం దా కాలమునందు పురుషులసంఖ్య యత్యల్పముగాను, స్త్రీలసంఖ్య యత్యధికముగాను ఉండెననుటకు లేశమయినను సందేహ ముండదు. అందుచేత నా కాలమునందు స్త్రీలకందఱకును వివాహమగుట సంభవింపఁ నేరదు గనుకను హిందువు లితరదేశములవారితో సంబంధములు చేయువారు కారు గనుకను అప్పుడు కొందఱికి మాత్రమే .వివాహమగుటకుఁ దగిన

యేర్పాటు చేసికోవలసి వచ్చినది. అందునిమిత్తమయి పెద్దలందఱును సభచేరి ధర్మబుద్ధిచేత విచారించి వివాహితలయి కొంతకాలము కాకపోయినఁ గొంతకాలమయినను వివాహసుఖ మనుభవించినవారికి మాత్రము పునర్వివాహములు లేకుండఁజేసి, కన్యలకు మాత్రమే వివాహములగునట్లు స్త్రీలోక రక్షణార్థముగా నియమము నొకదాని జేసిరి. అట్టి కట్టుపాటప్పుడు చేయకపోయిన పక్షమున, పురుషులు సాధారణముగా సద్యఃకాలమున కక్కఱకువచ్చెడు మితిమీఱియున్న యనాథలయిన యువతులనే వివాహము చేసికొందురు గనుకను, ఎప్పుడో యెదిగి కాపురమునకురాఁగల బాలికలను వివాహమాడ వాంఛింపరు గనుకను, కన్యలకు వివాహములుకాక వ్యభిచారాదిదోషములు ప్రబలును. అట్టి బాధకములను నివారించుటకై కొంతకాలము సౌఖ్యపడి తృప్తినొందియున్న వారికి వ్యభిచారాదులకు దిగకుండుటకు శక్యముగును గనుక వారికి వివాహములు మాన్పి కన్నియలకే మన పెద్ద లప్పటికి వివాహముల నేర్పఱిచిరి; వా రప్పుడంతకన్న చేయ వలసిన కార్య మేదియు లేదు. కొంతకాలము సౌఖ్య మనుభవించిన ముప్పదియేండ్ల యువతి యొక తెయు, పండ్రెండేండ్ల బాలిక యొక తెయు వివాహమునకుండి, పురుషుఁ డొక్కఁడుమాత్రమే దొరకెడు పక్షమున వివేకముగలవాఁ డెవ్వఁడైనను వయసుమీఱిన దాని నట్టేయుంచి కన్నియకు వివాహము చేయింపక మానఁడుగదా! ఆ ప్రకారము చేసి యిప్పటి పెద్దలు పురుషు లేవిధముగా మనదేశమును విడువకుం దురో, వ్యర్థులుగాక యేవిధముగా వివాహమున కక్కఱకు వత్తురో, యాయావిధములఁ జేయఁదగిన ప్రయత్నములను కట్టుపాటులను అన్నిటినిఁ జేసియున్నారు. వారప్పుడు పునర్వివాహములను మాన్పుటయేకాక, సముద్రయాత్రను, సన్న్యాసమును, వానప్రస్థాశ్రమమును,

దీర్ఘకాల బ్రహ్మచర్యమును, నరమేధమును, మహాప్రస్థానగమనమును, ఆతతాయిద్విజులధర్మ్యయుద్ధహింసనమును, మరణాంతిక ప్రాయోపవేశమును, అతిదూరతీర్థసేవనమును, భృగ్వగ్నిపతనమును, వృద్ధాదిమరణమును గూడ నిషేధించి యున్నారు. వారవ్వి డంతకంటె మఱియేమి చేయఁగలుగుదురు? ఆ కాలమున కా కట్టుపాటు సరిపడియే యుండినది. ఇప్పుడటువంటి యావశ్యకము మన దేశమున లేదు కనుకను, స్త్రీపునర్వివాహము లేకపోవుటవలన మన దేశమున కనేకానర్థములు కలుగుచున్నవి గనుకను, లోకరక్షణార్థమయి జీర్ణమయిపోయిన ధర్మము నవశ్యకముగా పునరుద్ధారణము చేయవలయుట వివేకశాలులయి దేశాభిమానము గలవారి కందఱికిని పరమధర్మము. పయి మనువచనమును బట్టియు, కలియుగాదిని పెద్దలేర్పఱిచిన కట్టుపాటులను బట్టియు, కాలానుగుణముగా స్మృత్యుక్త ధర్మములను సహితము విద్వాంసులు సభచేసి మార్చుకొన వచ్చునని యేర్పడు చుండఁగా జీర్ణమయిపోయిన ధర్మమును లోకరక్షణార్థము పునరుద్ధారణము చేయుటకు మనమేల సందేహపడవలెను? పూర్వులు నిషేధించిన సన్యాసము మొదలయిన వానిని కొందఱు పునరుద్ధారణము చేయుటకూడ దేశకాలానుసారముగా నిషేధించినవానిలో వేనినైనను పునరుద్ధారణము చేసికోవలెనని బోధించుచుండలేదా?

శ్లో. యత్కర్మ కుర్వతోఽస్య స్యా త్పరితోషోంతరాత్మనః
తత్ప్రయత్నేన కుర్వీత విపరీతంతు వర్జయేత్.

మను. అ. ౪, ౧౬౧

అను మనువచనమును మూలసూత్రమునుగాఁ గైకొని పామరుల మాటలను వినక యేపని మీా యంతరాత్మకు సంతోషము కలిగించునో యా పనినే లోకోపకారముగాఁ జేయఁజూడుఁడు. ఇన్ని

విధముల శాస్త్రము స్త్రీపునర్వివాహ మాచరణీయమని బోధించు చున్నను, అది లేకపోవుటవలన లోకములో ననంతములైన నష్టములు కనంబడుచున్నవి, జనులను ఈ సత్కార్యమునుండి విముఖులనుగాం జేయునది యొక్క-యాచారపిశాచముగాం గనంబడుచున్నది.

శ్లో. స్మృతి ర్వేదవిరోధేతు పరిత్యాగో యథా భవేత్
తథైవ లౌకికం వాక్యం స్మృతిబాధే పరిత్యజేత్.

వేదవిరుద్ధముగా నున్నప్పుడు స్మృతి యేలాగున పరిత్యాజ్యమో స్మృతివిరోధమయిన యాచారము సహిత మాలాగుననే పరిత్యాజ్య మగును గాన పరాశరస్మృతికి విరుద్ధమయిన యీ యాచార మవశ్య ముగా విడిచిపెట్టవలసి యున్నది. శ్రుతిస్మృతులను మీఱి వర్తించు వారు శిష్టులుకారు గనుకను, వారి యాచారము సదాచారము కాదు గనుకను శిష్టాచారము ప్రమాణమన్నమాట యీ విషయమున వర్తింపదు.

దాయాది నిర్ణయ ప్రమాణములు

పైని జెప్పిన దంతయు విని నిజముగా స్త్రీ పునర్వివాహము శాస్త్రసమ్మతమే యయిన యెడల, పునర్వివాహితల పుత్రులకు దాయ మెక్కడం జెప్పంబడెననియు, పునర్వివాహమునకు మంత్రము లెక్కడ నున్నవనియు, తండ్రికి మరల కన్యాదానము చేయుటకు స్వత్వ మెట్లు కలుగుననియు, జాతాశౌచ మృతాశౌచములకు విధు లెక్కడ నున్నవనియు, పూర్వభర్తయొక్క శ్రాద్ధ మెవ్వరు పెట్టవల యుననియు, పునర్వివాహమున కన్యను ఏగోత్రమున దానము చేయ వలయుననియు, వపనము జరిగిన స్త్రీగతి యేమికావలయు ననియు, ప్రతిపక్షులు ప్రశ్న చేయవచ్చును. కాంబట్టి యీ యంశముల కన్నిటి కిని సంగ్రహముగా సమాధానములు చెప్పెదను.

౧. దాయము.—పరాశరస్మృతినిబట్టి స్త్రీ పునర్వివాహము వలనఁ బుట్టిన పుత్రులు ఈ యుగమున ఔరసులే యగుదురు గాన వారికి మొదటి భార్యవలనఁ గలిగిన పుత్రులకు వలెనే దాయము వచ్చును. పూర్వయుగములయందు సహితము పౌనర్భవులకు దాయము సమస్త స్మృతులయందును జెప్పఁబడి యున్నది.

శ్లో. ఔరసః పుత్రికాపుత్రః క్షేత్రజో గూఢజ స్తథా
కానీనః పంచమప్రోక్త ష్షష్ఠః పౌనర్భవః స్మృతః.
దత్తః క్రీతః కృత్రిమశ్చ స్వయందత్త ఇతీరితః
సహోఢ జోపవిద్ధశ్చ పుత్రా ద్వాదశ కీర్తితాః.

* * * *

పిండ దోంశ హర శ్చేషాం పూర్వాభావే పరఃపరః

యాజ్ఞవల్క్యస్మృతి.

అని యాజ్ఞవల్క్యుఁడు ద్వాదశవిధ పుత్రులను జెప్పి వారు వరుసగా నొకరి యభావమునం దొకరు తండ్రికి పరక్రియలు జరపి శ్రాద్ధము పెట్టుటకును, దాయమును పొందుటకును సర్హులని నిర్ణయించియున్నాఁడు; అంతేకాక యతఁడు పౌనర్భవుని దత్తపుత్రుని కంటె ముఖ్యునిగాఁగూడ నేర్పఱిచి యున్నాఁడు.

శ్లో. ద్వౌతు యౌ వివదేయాతాం ద్వాభ్యాం జాతౌ స్త్రియా ధనే
తయో ర్యద్యస్య పిత్ర్యం స్యా త్తత్సగృహ్ణీత నేతరః.

మనుస్మృతి, అ ౯.

ఇద్దఱు తండ్రులవలన నొక్క స్త్రీయందుఁ గలిగిన పుత్రులు తమ తల్లియొద్ద నున్న ధనము నిమిత్తము వివాదపడెడు పక్షమున, ఎవని తండ్రిసొత్తును వాఁడు పొందవలయునే కాని యితరమును పొందఁ గూడదు అని మనువు చెప్పియున్నాఁడు.

శ్లో. అనేక పితృకాణాం చ పితృతో భాగకల్పనా
యస్య యత్ పైతృకం రిక్థం స తద్గృహ్ణీత నేతరః.

విష్ణుస్మృతి.

అను విష్ణువచనమునుబట్టి స్త్రీకి మొదటిభర్తవలనను రెండవ భర్తవలనను గూడ సంతాన మున్నయెడల వారు తండ్రులనుబట్టి భాగము పంచుకోవలసినవా రగుదురు.

౨. మంత్రములు:— పురుషులకువలెనే స్త్రీలకును మొదటి మంత్రములే ద్వితీయవివాహమునకును పనికివచ్చును. తొమ్మిదిసంవత్సరములదానికిఁగాని పండ్రెండు సంవత్సరములదానికిఁగాని వివాహము చేయునప్పుడు మంత్రములయందలి "కన్యామ్" అను పదమును "రోహిణీమ్" అనికాని, "రజస్వలామ్" అనికాని మార్చునట్లే స్త్రీపునర్వివాహమునందును మంత్రములను మార్చవలసిన యావశ్యకము లేదు. పూర్వోదాహృతమయిన "విధవా యా భవేత్కన్యా" మొదలయిన స్మృతివచనములను బట్టి విధవకు సహితము కన్యాశబ్ద వ్యవహారము కలదు గాన ద్వితీయ వివాహమునందును పూర్వమంత్రములే నిరాక్షేపముగా నుపయోగింపఁబడవచ్చును. ఒకపక్షమున మొదటి మంత్రములు ఒక్క పురుషుల విషయమున మాత్రమే పనికిరావని చెప్పవచ్చును. దానవాక్యములో "స్నాతకాయ కన్యార్థినే తుభ్యమహం సంప్రదదే" యని కన్యను గోరెడు స్నాతకుఁడవైన నీకు నేను కన్య నిచ్చుచున్నానని యుండుటవలనను ద్వితీయవివాహము చేసికొనువాఁడు స్నాతకుఁడెన్నఁడును కానేరఁడు గనుకను, విధుర విషయమున దాన వాక్యమెట్లుపయోగించును?

శ్లో. అవిప్లుత బ్రహ్మచర్యో లక్షణ్యాం స్త్రియ ముద్వహేత్
అనన్య పూర్వికాం కాంతా మసపిండా మవీయసీమ్.

అను యాజ్ఞవల్క్య వచనమునుబట్టి బ్రహ్మచారి లక్షణవంతు రాలును, పరపూర్వ కానిదియు, మనోహరురాలును, అసపిండురాలును వయస్సుచే చిన్నదియు నగు స్త్రీని వివాహమాడవలయునని విధి యగుటవలన, యనన్యపూర్విక యనుటచే వివాహితకు మరల వివాహము కూడదనియు శంకింపవచ్చును. యాజ్ఞవల్క్యుడు స్త్రీవిషయమున "అనన్యపూర్విక" యన్నట్టే పురుషవిషయమున "అవిప్లుత బ్రహ్మచర్య" యని కూడఁ జెప్పియున్నాఁడు. ఈ ప్రకారముగానే బోధాయనులు "శ్రుతిశీలినే విజ్ఞాయ బ్రహచారిణేఽర్థినే దేయా" యని వేదాభ్యాసకుఁడును, సదాచారసంపన్నుఁడును, బ్రహ్మచారియు నైన వరునకు కన్య నియ్యవలయుననియే చెప్పియున్నాఁడు. వీని యథార్థమునే మనము పుచ్చుకొన్నయెడల పురుషులలో సహితము బ్రహ్మచారులకు తప్ప మఱియెవ్వరికిని వివాహము కాకపోవలసి యుండును. ఈ సామాన్యవిధుల కపవాదములుగా స్త్రీలకువలెనే పురుషులకును పునర్వివాహవిషయమున విశేషవిధు లనేకములు కనఁబడుచున్నందున, కన్యావరు లట్టి లక్షణములు కలవారగుట ప్రశస్తమనియే కాని విధియని యేర్పడదు. అంతేకాక,—

శ్లో. పతిం హిత్వాపకృష్టం స్వముత్కృష్టం యా నిషేవతే
నింద్యైవ సా భవే ల్లోకే పరపూర్వేతి చోచ్యతే.

అను మనువచనమువలన హీనుఁడగు పతిని విడిచిపెట్టి ఘనుఁడగువానిం జేరినదే పరపూర్వ యగును గాన, అట్టిదానిని వివాహమాడఁగూడదనియైనను "అనన్య పూర్వికా" శబ్దముచేత నర్థము చేయవచ్చును.

3. కన్యాదాత:—ప్రథమ వివాహమునందు వలెనే ద్వితీయ వివాహమునందును కన్యాదాతలు తండ్రి మొదలగువారే.

శ్లో. పితా దద్యా త్స్వయం కన్యాం భ్రాతా వానుమతే పితుః
మాతామహో మాతులశ్చ సకుల్యో బాంధవ స్తథా.
మాతాత్వభావే సర్వేషాం ప్రకృతౌ యదివర్తతే
తస్యా మప్రకృతిస్థాయాం కన్యాం దద్యు స్స్వజాతయః.

నారదసంహిత.

అని నారదుఁడు ప్రథమ ద్వితీయ వివాహవివేచనము చేయక సామాన్యముగా కన్యను దానము చేయవలసినవారు తండ్రి మొదలు కొని స్వజాతివారు వఱకును జెప్పియున్నాఁడు. కాఁబట్టి పునర్వివాహము నందు కన్యను పునర్దానము చేయవలసినవారు తండ్రి మొదలగువా రనుట కే యాక్షేపమును లేదు. పూర్వము దివోదాసుఁడు తన కొమార్తెయైన దివ్యాదేవిని, ఐరావతుఁడు తన కూఁతురైన యులూపిని, పునర్దానము చేసినట్లు వెనుక నుదాహరించిన పురాణవచనములవలనఁ గూడ స్పష్టమగుచున్నది. ఇంకుమీఁద నొకసారి యిచ్చివేసిన కన్యను మరల నిచ్చుటకు తండ్రి మొదలగువారికి స్వత్వ మెక్కడనుండి వచ్చు నని సందేహము తోఁచవచ్చును. స్త్రీ పునర్వివాహమునకు విధు లెప్పు డున్నవో యప్పుడే పునర్దానము శాస్త్రవిహిత మగును గనుక, అట్టి సందేహమున కవకాశమే లేదు. కన్యాదానము వధూవరు లిద్దఱును యావజ్జీవము పరస్పర సౌఖ్యము నిమిత్తమును ధర్మప్రజోత్పత్త్యర్థమును కలిసి యుండుటకయి యేర్పడిన వివాహసంబంధము యొక్క పూర్వాం గమే కాని దాత కన్యయెడలఁ గల తన సత్వమును పూర్ణముగా వదలు కొని యన్యునకు స్వత్వము కలుగఁజేయుట కాదు. అట్లు కానియెడల పూర్వోక్త నారదవచన ప్రకారముగా, కన్యక విషయమున బొత్తిగా స్వత్వము లేని స్వజాతివారు సహితము కన్యను దానము చేయుట కెట్లర్హు లగుదురు? తక్కిన సమస్త దానములయందును "సంప్రద

దేన మమ" ఈవస్తువు 'నీ కిచ్చుచున్నాను; ఇఁక నాది కాదు' అని యుండి కన్యాదానమునందు మాత్రము 'న మమ" 'నాది కాదు' అను మాట యుండఁగూడదని విధులుండుటయు, కన్యాదాన మాత్రముననే మగని యధీనురాలుగాక యుక్తవయస్సు వచ్చుపర్యంతము జనకుని యింటనే యుండవలయుటయు, దానమాత్రము చేతనే పుత్రికాత్వము పోక జనకుని సొత్తునకు పుత్రికయు నామె పుత్రులును కర్త లగుటయు, విధవకు పరాశరుఁడు పితృగృహ నివాసమే విధించుటయు, దుహిత విషయమయిన స్వత్వము తండ్రికి కన్యాదానమాత్రమున పోదనుటకు జాలిన నిదర్శనములుగా నుండవచ్చును. అట్లు కాదేని, స్త్రీ పునర్వివాహమును విధించెడి శ్రుతిస్మృతిపురాణ వచనములన్నియు నిష్ప్రయోజనములు కావలసివచ్చును.

౮. జాతాశౌచ మృతాశౌచములు:— తల్లి విషయమున కొమాళ్ళు కాని, భార్యవిషయమున భర్త కాని, పట్టవలసిన సూతకాదులనుగూర్చి యిప్పుడు సందేహమేదియు లేదు. ఆవిషయమున సామాన్యవిధులే పనికివచ్చును. ఇఁక నొకస్త్రీకి పూర్వభర్తవలనను పరభర్తవలననుకూడ సంతానాదికము కలిగినయెడల వారిలో వారికి మాత్రము సూతకాదులు నిర్ణయింపవలసి యుండును.

శ్లో. మాతైకయా ద్విపితృకౌ భ్రాతరా వన్యగోత్రజౌ
ఏకాహం సూతకే తత్ర త్రిరాత్రం మృతకే తయోః.

మరీచి స్మృతి.

అను మాధవాచార్య ధృతమయిన మరీచివచనము ఒక తల్లియం దిద్దఱు తండ్రులవలనఁ బుట్టిన వేఱువేఱు గోత్రములుగల సోదరుల విషయమయి యన్యోన్యము పురుడు ఒక్క దినమేయనియు, మృతాశౌచము మూఁడుదినములనియు విధించుచున్నది. వారేకగోత్రజు

లయిన పక్షమున ఆశౌచము పదిదినములన్నమాట వేఱుగ చెప్ప నక్కఱయే లేదు.

౫. పూర్వభర్తృశ్రాద్ధము:— పునర్వివాహిత ప్రథమ భర్త వలన సంతానముకలదిమైనప్పుడు అతని శ్రాద్ధవిషయమయి సందేహామే లేదు.

శ్లో. అపుత్రా శయనం భర్తుః పాలయంతీ వ్రతే స్థితా
పత్న్యేవ దద్యాత్తత్పిండం కృత్స్న మంశం లభేతచ —మనువు

అను విజ్ఞానేశ్వరధృత వృద్ధమను వచనము వలన అపుత్రవంతు రాలు భర్తృశయన పరిపాలనము చేయుచు, బ్రహ్మచర్య వ్రతమునం దున్నయెడలనే భర్తకు పిండప్రదానముచేసి భాగమును స్వీకరింప వలయునని విధించుటచేత, స్త్రీ బ్రహ్మచర్యవ్రతమును మాని వివాహ మాడినయెడల శ్రాద్ధము పెట్టనక్కఱ లేదని స్పష్టమగుచున్నది. స్త్రీ పునర్వివాహమువలన మఱియొక గోత్రమునకు మాఱును గనుకను, మొదటిభర్త కుటుంబముతోడి సంబంధమును పూర్ణముగా వదులుకొని యాశ్రమాంతరమును స్వీకరించును గనుకను, పూర్వ భర్తయొక్క శ్రాద్ధాదులు పెట్టకుండుట న్యాయమే. పురుషుఁడు సహితము దత్తుఁడై యన్య గోత్రమునకు మాఱినప్పుడును తన కుటుంబముతోడి సంబంధ మును వదులుకొని సన్యాసాశ్రమమును స్వీకరించినప్పుడును జనకుని యొక్క శ్రాద్ధమునే పరిత్యజించునుగదా?

౬. గోత్రము— కన్యాదానము తండ్రిగోత్రముననే యవశ్య ముగా జరగవలయును. గోత్రశబ్దార్థమును కొంచెము విచారించిన పక్షమున సందేహమే కలుగకపోవును.

శ్లో. జమదగ్ని ర్భరద్వాజో విశ్వామిత్రాఽత్రి గౌతమాః
వశిష్ఠ కాశ్యపాఽగస్త్యా మునయో గోత్రకారిణః.
ఏతేషాం యాన్యపత్యాని తాని గోత్రాణి మన్యతే.

జమదగ్ని, భరద్వాజుఁడు, విశ్వామిత్రుఁడు, అత్రి, గౌతముఁడు, వశిష్ఠుఁడు, కాశ్యపుఁడు, అగస్త్యుఁడు, గోత్రకర్తలనియు, వీరిలో నెవరి గోత్రమునఁ బుట్టినవారు వారిగోత్రము కలవారగుదురనియు పై స్మృతివచనములు బోధించుచున్నవి. ఇందువలన తండ్రి గోత్రమే కొమార్తెదియు నగుననుట నిస్సందేహముకదా ?

శ్లో. స్వగోత్రాద్భ్రశ్యతే నారీ వివాహాత్సప్తమే పదే
పతిగోత్రేణ కర్తవ్యా తస్యాః పిండోదక క్రియా.

అను లఘుహారీత వచనమునుబట్టి స్త్రీ వివాహమువలన సప్తపది యందు తన గోత్రమును పోగొట్టుకొనుననియు, పతిగోత్రముచేత నామె పిండోదకక్రియలు చేయవలయుననియు, కనబడుచున్నది. ఇందలి పూర్వార్థముచేతనే స్వగోత్రము మాఱునని కనఁబడు చుండఁగా మరల ఉత్తరార్థముచేత నామె పిండోదకక్రియలు పతి గోత్రమున చేయవలయునని చెప్పుటచేత కర్మలు చేయునప్పుడు భర్తగోత్రమున చేయవలసినను తనగోత్రమునుకూడ నామె కలిగి యుండుననియే యూహింపఁదగియున్నది.

శ్లో. సంస్కృతాయాం తు భార్యాయాం సపిండీకరణాంతికం
పైతృకం భజతే గోత్ర మూర్ధ్వంతు పతిపైతృకమ్.

అను కాత్యాయన వచనమువలన కర్మకు పతిగోత్రమునే యుపయోగించినను, వివాహితయైన స్త్రీ తన సపిండీకరణమువఱకును తన పితృగోత్రమునే ధరించుననియును, అటుపిమ్మట పూర్ణముగా భర్తృగోత్రమును పొందుననియు స్పష్టమగుచున్నది. ఇందుచేతనే వివా హితస్త్రీ తనతండ్రికి గయాశ్రాద్ధాదులుచేయుట కర్హురాలగుచున్నది.

శ్లో. అముష్య పౌత్రిం చాముష్య పుత్రిం చాముష్య గోత్రజాం
ఇమాం కన్యాం వరాయాస్మై వయం తద్వివృణీమహే
శ్రుణుధ్వ మితి వై బ్రూయా దసౌ కన్యాప్రదాయకః.

అనుటవలన కన్యాప్రదాత ఫలానివాని పౌత్రియు, ఫలాని వాని పుత్రియు, ఫలానివాని గోత్రమునఁ బుట్టినదియును, అగు నీకన్యను ఈ వరున కిచ్చుచున్నానని యందఱి ముందఱ నుపలుకవలసినట్టు కనఁబడుచున్నది. ఒకసారి వివాహమాడిన మాత్రమున స్త్రీ తన పితామహునకు పౌత్రియు జనకునకు పుత్రికయుఁ గోత్రమునఁ బుట్టినదియు కాకపోదు గనుక,-

శ్లో. వరగోత్రం సముచ్చార్య ప్రపితామహ పూర్వకమ్
నామసంకీర్తయే ద్విద్వాన్ కన్యాయాశ్చైవ మేవ హి.

ప్రపితామహపూర్వకముగా వరగోత్రము నుచ్చరించి నామమును ప్రకటించి యదేప్రకారముగా కన్యయొక్క గోత్రనామములను జెప్పవలసిన వివాహమంత్రములయందు కన్యయొక్క పితృగోత్రము తప్ప మఱియొక్క గోత్రము ఉచ్చరించుటకు మంత్రములను బట్టియే యవకాశము లేదు. కాఁబట్టి కన్య యవశ్యముగా పితృగోత్రముతోనే పునర్దానము చేయఁబడవలయును.

౭. ముండనము — "మృతభర్తృకకు మగఁడుపోయిన పదవ దినమున శిరోముండనము చేయవలయునుగదా? పునర్వివాహమును చేసికొనెడి స్త్రీకి అట్టిపనిని చేయఁగూడదని యెక్కడనైన విధి యున్నదా" యని కొందఱడుగవచ్చును. స్త్రీకి పదవదినమున తల గొరిగించుట లౌకికమేకాని స్మృతిసమ్మతము కాదు; అట్టి ముండనమును విధించు మంత్రము లెక్కడను కనఁబడవు. స్త్రీలకు కేశవపనము లేదని పెక్కుస్మృతులు లైకకంఠ్యముగా ఘోషించుచున్నవి. పరాశరుఁడును,-

శ్లో. సర్వాన్ కేశాన్ సముద్ధృత్య ఛేదయే దంగుళద్వయమ్
ఏవం నారీ కుమారీణాం శిరసో ముండనం స్మృతమ్.

న స్త్రీయాగ కేశవపనమ్ న దూరే శయనాసనమ్
నచ గోష్ఠే వసేద్రాత్రౌ న దివాగా అనుప్రజేత్
నదీషు సంగమేచైవ అరణ్యేషు విశేషతః
న స్త్రీణా మజినం వాసో వ్రతమేవ సమాచరేత్.

అని తొమ్మిదవ యధ్యాయమున స్త్రీలకుఁగాని బాలికలకుఁగాని యెక్కడనైనను ముండనము విధించిన పక్షమున కేశముల నన్నిటిని వదలివేసి చివర రెండంగుళములు మాత్రము ఖండింపవలయు ననియు, బ్రహ్మచర్యాది వ్రతములయందు స్త్రీల కెప్పుడును కేశవప నము లేదనియు స్పష్టపఱిచి యున్నాఁడు. ఈ పైని వ్రాసిన దానివలన ప్రతిపక్షులు సాధారణముగాఁ జేయు ముఖ్యమయిన యాక్షేపణల కన్నిటికిని సంగ్రహముగా సమాధానములు వచ్చినవని తలఁచెదను.

పౌనర్భవ విచారము

కొందఱు చెప్పిన దంతయు నొప్పుకొని స్త్రీపునర్వివాహము శాస్త్రసమ్మతమే కాని ద్వితీయవివాహము చేసికొన్నవారును తత్సం తతివారును ప్రథమవివాహితలకంటెను తత్సంతతివారికంటెను తక్కు వవారనియు, వారు అపాంక్తేయులును, హవ్యకవ్యముల కుపనికి రానివారు ననియు; వారు ప్రత్యేకజాతిగా నుండఁదగినవారనియు వాదించుచు తెలియనివారిని భ్రమింపఁజేయుదురు. అట్టివారు చూపెడు ప్రమాణములను గూర్చి కొంత విమర్శింతము.

మనుస్మృతి, తృతీయాధ్యాయము

శ్లో. చికిత్సకాన్ దేవలకాన్ మాంసవిక్రయిణ స్తథా
విపణేన చ జీవంతో వర్జ్యా స్స్యు ర్హవ్యకవ్యయోః. ౧౫౨
ప్రేష్యో గ్రామస్య రాజ్ఞశ్చ కునఖీ శ్యావదంతకః
ప్రతిరోద్ధా గురోశ్చైవ త్యక్తాగ్ని ర్వార్ధుషిక స్తథా. ౧౫౩

యక్ష్మీచ పశుపాలశ్చ పరివేత్తా నిరాకృతిః
బ్రహ్మద్విట్ పరివిత్తిశ్చ గణాభ్యంతర ఏవ చ. ౧౫౪
కుశీలవోఽవకీర్ణీ చ వృషలీపతి రేవ చ
పౌనర్భవశ్చ కాణశ్చ యస్య చోపపతి ర్గృహే. ౧౫౫
భృతకాధ్యాపకో యశ్చ భృతకాధ్యాపిత స్తథా
శూద్రశిష్యో గురుశ్చైవ వాగ్దుష్టః కుండగోళకౌ. ౧౫౬
అకారణపరిత్యక్తా మాతాపిత్రో గురో స్తథా
బ్రాహ్మైర్యౌనైశ్చ సంబంధై స్సంయోగం పతితైర్గతః. ౧౫౭
అగారదాహీ గరదః కుండాశీ సోమవిక్రయీ
సముద్రయాయీ వందీచ తైలికః కూటకారకః. ౧౫౮
పిత్రావివదమానశ్చ కితవో మద్యప స్తథా
పాపరోగ్యఽభిశస్తశ్చ దాంభికో రసవిక్రయీ. ౧౫౯
ధనుశ్శరాణాం కర్తాచ యశ్చాగ్రే దిధిషూపతిః
మిత్రధ్రు గ్ద్యూతవృత్తిశ్చ పుత్రాచార్య స్తథైవ చ. ౧౬౦
భ్రామరీ గండమాలీచ శ్విత్ర్యథో పిశున స్తథా
ఉన్మత్తోఽంధశ్చ వర్జ్యాః స్యు ర్వేదనిందక ఏవ చ. ౧౬౧
హస్తిగోఽశ్వోష్ట్ర దమకో నక్షత్రై ర్యశ్చ జీవతి
పక్షిణాం పోషకో యశ్చ యుద్ధాచార్య స్తథైవ చ. ౧౬౨
స్రోతసాం భేదకో యశ్చ తేషాం చావరణేతరః
గృహసంవేశకో దూతో వృక్షారోపక ఏవ చ. ౧౬౩
శ్వక్రీడీ శ్యేనజీవీ చ కన్యాదూషక ఏవ చ
హింస్రో వృషలవృత్తిశ్చ గణానాం చైవ యాజకః. ౧౬౪
ఆచారహీనః క్లీబశ్చ నిత్యం యాచనక స్తథా
కృషిజీవీ శ్లీపదీచ సద్భిర్నిందిత ఏవ చ. ౧౬౫

శౌరభ్రికో మాహిషికః పరపూర్వాపతి స్తథా
ప్రేతనిర్యాతకశ్చైవ వర్జనీయాః ప్రయత్నతః. ౧౬౬

ఏతాన్ విగర్హితాచారా నపాంక్తేయాన్ ద్విజాధమాన్
ద్విజాతిప్రవరో విద్వా నుభయత్ర వివర్జయేత్. ౧౬౭

ఆయాస్మృతులు ప్రత్యేకముగా పునర్భువు నేప్రకారముగా నిర్వచించి పునర్భువులను పునర్భూపుత్రులను ఎట్టివారినిగాఁ జెప్పినవో యాసంగతి నించుకయు విచారింపక, పునర్భూలక్షణ మొక స్మృతినుండియు తద్దూషణము మఱియొక స్మృతినుండియు పుచ్చుకొని మనసువచ్చినట్టుగా నొకదానితో నొకటి కలిపి పాడుచేయుటవలన నీ యసందర్భార్థము పొసగినదే కాని దేనికది ప్రత్యేకముగా విమర్శించినపక్షమున విధివిహితముగా పునర్వివాహము చేసికొన్నవారు పునర్భువులే కారనియు, ఒకవేళ పునర్భూనామము వారికిఁగూడ కలిగినను వారు నింద్యులైన నిషిద్ధ పునర్భూజాతిలో చేరరనియు, నిమిషములో స్పష్టము కాఁగలదు. "ఋషీణాం మతయశ్చ భిన్నాః" అని యుండుటచే తక్కిన సహస్రవిషయములయందువలెనే పునర్భూనిర్ణయమునందును స్మృతికర్తలు భిన్నాభిప్రాయము కలవారుగానే యున్నను, అన్నిఁటిని సమన్వయము చేసెడి పక్షమున విధ్యుక్తవివాహమాడిన పునర్భువు లెంతమాత్రమును దూష్యులు కారనియే సిద్ధాంత మేర్పడును.

౧. శ్లో. సప్తపౌనర్భవాః కన్యా వర్జనీయాః కులాధమాః
వాచాదత్తా మనోదత్తా-కృతకౌతుకమంగళా.
ఉదకస్పర్శితా యా చ యా చ పాణిగృహీతికా
అగ్నిం పరిగతా యా చ పునర్భూ ప్రభవా చ యా.
ఇత్యేతాః కాశ్యపే నోక్తా దహన్తి కుల మగ్నివత్-కాశ్యపస్మృతి

అని కశ్యపుఁడు వాగ్దత్తలను, మనోదత్తలను, మంగళస్నానాదికము చేసినవారిని, ఉదకస్పర్శితలను, పాణిగృహీతకలను, అగ్నిప్రదక్షిణము చేసినవారిని, పునర్భూప్రభవలను, ఏకవిధముగా నీ యేడుగురను పునర్భువులనుగాఁ జెప్పి వారు కులము నగ్నిహోత్రమువలె కాల్చివేయుదురని దూషించియున్నాఁడు. దీని యవయవార్థమునే మనము పుచ్చుకొని ప్రవర్తింతుమేని, ఇంచుమించుగా లోకములోని కన్నియ లందఱును పునర్భువులే యాయి దూష్యురాండ్రు కావలసి వచ్చును. ఎల్లవారికిని తమకూఁతులను మొదట మనసులో నొకరి కియ్యవలె ననుకొనియు, వారి కిచ్చెదమని నోటితో చెప్పియు, మంచి వరుఁడు లభించిన యెడల తమ యుద్దేశమును మార్చుకొనుట సహజమయి యుండును. అంతేకాక పయిని జెప్పఁబడినవారిలో మొదటి యైదు తెగలవారికిని మనమిప్పుడు నిరాక్షేపముగా వివాహములు చేయుచునే యున్నాము. అట్టి కన్నియలు పునర్భువులని చెప్పుట కెవ్వరును సాహసింపరు.

శ్లో. దత్తాం న్యాయేన యః కన్యాం వరాయ న దదాతి తాం
అదుష్టశ్చే ద్వరో రాజ్ఞా సదండ్య స్తత్ర చోరవత్ - నారదుఁడు.

న్యాయముచేత నియ్యఁబడిన కన్యను వరున కెవ్వఁడియ్యఁడో వాఁడు వరుఁడు దుష్టుఁడు కానిపక్షమున రాజుచే చోరునివలెనే దండ్యుఁడగునని చెప్పు నారదాది స్మృతివచనముల ననుసరించి పై కాశ్యప వచనమునకు అదుష్టవరపరమని సంకోచము కల్పించి శాస్త్రోదితమయిన వరదోషము లేక ధనాశచేతను ద్వేషముచేతను వివాహము చేసినప్పుడుమాత్రమే వాగ్దత్తాదులు పునర్భువు లగుదురని నిర్ణయము చేసియున్నారు. ఈప్రకారముగానే బోధాయనులును,—

వాచాదత్తా మనోదత్తాఽగ్నింపరిగతా
సప్తమంపదం నీతా భుక్తా గృహీతగర్భా

ప్రసూతా చేతి సప్తవిధా పునర్భ్వాస్తాం
గృహీత్వా న ప్రజాం న ధర్మం విందేత.

వాగ్దత్తాదులగు సప్తవిధ పునర్భువులను చెప్పి కశ్యపుఁడు చెప్పిన వారిలో నడుమ కొందఱిని వదలి సంభోగసౌఖ్య మనుభవించిన దానిని, గర్భము ధరించిన దానిని, సంతానము కన్నదానిని గూడఁజేర్చి వారిని గ్రహించి సంతానమును ధర్మమును పొందఁ గూడదని విధించి యున్నాఁడు. అనేకస్మృతులు వాగ్దత్తాదులకు వివాహమును విధించుచున్నవి. ఇందుకు నిదర్శనముగా కాత్యాయనుఁడు,—

శ్లో. వరే దేశాంతరగతే త్రీనృతూ నృంప్రతీక్ష్య వా
కన్యాన్యస్మై ప్రదాతవ్యా వాగ్దానేతు కృతే సతి.
పంచత్వం చే ద్వరో గచ్ఛేత్ వాగ్దానేతు కృతే సత
కన్యాన్యస్మై ప్రదాతవ్యా తథా సప్తపదాత్పరమ్.

వరుఁడు వాగ్దానాంతరము దేశాంతరము పోయినను, మృతుఁడయినను, కన్యను మఱియొకని కియ్యవలెనని చెప్పుచున్నాఁడు. ఆ ప్రకారముగానే లోకములో సర్వసాధారణముగా వ్యవహారమును జరుగుచున్నది. అట్టి కన్యకల నెవ్వరును పునర్భువులనిగాని తక్కువ వారనిగాని యెంచరు. దీనినిబట్టి చూడఁగా పునర్భువులను నిందించిన యీ స్మృతియందుఁగాని మఱియొక స్మృతియందుఁగాని వివాహ మెవ్వరికి విధింపఁబడెనో వారు పునర్భూ నిర్వచనమునకు లోఁబడినవా రయినను వారికి పునర్భూనామము చెందదనియు, వారేవిధముచేతను తక్కినవారికంటె తక్కువవారు కారనియు విస్పష్ట మగుచున్నది. సప్తపదికి పూర్వమునం దనేకస్మృతులలో వివాహము విధింపఁబడినది గనుక నట్టివారు పునర్భువులు గాకుండవచ్చును గాని సప్తపద్యనంతరము వివాహమాడువారు పునర్భువులు కాకతప్పరని కొంద

అనవచ్చును. సప్తపదికి పూర్వముసందు వివాహమును విధించిన కాత్యాయనవచనమే "తథా సప్తపదా త్పర" మని సప్తపది తరువా సహితము మృతభర్తృకకు పునర్వివాహము విధించుచున్నది గనుక పూర్వము చెప్పిన హేతువుచేతనే సప్తపద్యనంతగము శాస్త్రవిహిత మయిన వివాహము చేసికొన్నవారు సహితము పునర్భువులు కారు. మఱియు పునర్భువుల నాప్రకారముగా నిందించిన బోధాయనుఁడే తన స్మృతిలోని వివాహప్రకరణమునందు,-

శ్లో. నిసృష్టో వా హతో వాపి యస్యా భర్తా మ్రియేతి వా
సా చే దక్షతయోని స్స్యాత్ గతప్రత్యాగ తాపివా
పౌనర్భవేన విధినా పున సంస్కార మర్హతి.

భర్త నష్టుడయినప్పుడును హతుఁడయినప్పుడును మృతుఁడయినప్పుడును అక్షతయోనికి పునరుద్వాహమును విధించుచున్నాఁడు. ఇందువలన బోధాయనుని యభిప్రాయము విధ్యనుసారముగా వివాహితలయినవారు తప్ప తక్కిన స్త్రీలే పునర్భువు లగుదురనియు శాస్త్రమును తిరస్కరించి వివాహము చేసుకొనువారు మాత్రమే పునర్భువులును దూష్యులును అగుదురనియు ననుట కరతలామలక మయిన విషయమే కాఁబట్టి "నష్టే మృతే" లోనుగాగల పునరుద్వాహ విధుల ననుసరించి వివాహము చేసికొన్నవారు పునర్భువులు కారనియు ఏస్మృతియందు పునర్భూలక్షణ మేవిధముగాఁ జెప్పఁబడినను శాస్త్ర విధుల నతిక్రమించి వివాహమాడినవారును వారి సంతతివారును మాత్రమే పునర్భువులును పౌనర్భవులును నయి నింద్య లగుదు రనియు పరమసిద్ధాంత మగుచున్నది.

౨. ఒకవేళ యౌగికముగా పునర్వివాహము చేసికొనెడి స్త్రీలం దఱియందును పునర్భూశబ్దము వర్తించినను, పునర్భువులను దూషిం

చెడి సామాన్యవిధుల కపవాదములుగా నుండు విశేషవిధులచేత విధ్యుక్తరీతిని వివాహము చేసికొన్న స్త్రీలును వారి కొమాళ్ళు మొద లయినవారును పరిరక్షింపఁబడి యెంతమాత్రమును వారు దూష్యులు కాకయే యుందురు ఎట్లనఁగా,—

శ్లో. దారాగ్నిహోత్రసంయోగం కురుతే యోఽగ్రజే స్థితే
పరివేత్తా స విజ్ఞేయః పరివిత్తిస్తు పూర్వజః.

మనువు. అ 3, శ్లో. ౧౭౧

అను వచనమునుబట్టి అన్నకు ముందు వివాహమాడువాఁడు పరివేత్త యనఁబడును. అట్టి పరివేత్త పాపాత్ముఁడయిన నరకమును పొందుననియు బహుస్మృతులు ఘోషించుచున్నవి. పౌనర్భవాదులను పంక్తిబాహ్యులనుగాఁ జెప్పిన పూర్వోదాహృత మనువచనముల లోనే పరివేత్తకూడ అపాంక్తేయుఁడుగాను హవ్యకవ్యముల కక్కఱకు రానివాఁడుగాను పరిగణింపబడి యున్నాఁడు. అయినను,-

శ్లో. కుబ్జవామన షండేషు గద్గదేషు జడేషు చ
జాత్యంధే బధిరే మూకే న దోషః పరివేదనే.

అని స్మృత్యంతరమునందు జ్యేష్ఠభ్రాత కుబ్జుఁడుగాఁ గాని, వామనుఁడుగాఁగాని, నపుంసకుఁడుగాఁగాని, నత్తిగలవాఁడుగాఁ గాని, జడుఁడుగాఁగాని, జాత్యంధుఁడుగాఁగాని, చెవిటివాఁడుగాఁగాని, మూగవాఁడుగాఁగాని ఉన్నయెడల పరివేదనమువలన దోషము లేదని అపవాదవిధి కనఁబడుచున్నది. అందుచేత అన్నకు ముందుగా వివాహము చేసికొన్నవాఁడగుటచే నతఁడు పరివేత్తయైనను, అన్న యందు కుబ్జత్వాది దోషము లున్నప్పుడు విధ్యనుసారముగా వివాహము చేసికొన్న కనిష్ఠభ్రాత యెన్నఁడు నపాంక్తేయుఁడును దూష్యుఁడును కానేరఁడు. అదేప్రకారముగా ద్వితీయవివాహము చేసుకొన్న స్త్రీ

లందఱును పేరున పునర్భువులే యగుదురని చెప్పఁబడియున్నను నష్టే మృతేత్యాది స్మృతివచనముల ననుసరించి వివాహముల చేసికొన్న వారును వారిపుత్రాదులును పంక్తి కనర్హులును దూష్యులును కారు.

3. ప్రతిస్మృతిని ప్రత్యేకముగాఁ జదివి యా స్మృతికర్త చెప్పిన పునర్భూ లక్షణములను పునర్భువుల యోగ్యతను పరీక్షించిన యెడల, విధివిహితముగా పునర్వివాహ మాడిన స్త్రీ లేవిషయమునను తక్కువవారుగా నుండనట్టు తెలిసికోవచ్చునని యీవఱకే తెలిపి యున్నాను. కొందఱు స్మృతికర్తలు శాస్త్రమును మీఱి పరపురుషుని వరించి సంతానము గన్నవారినే పునర్భువులనుగాఁ జెప్పి వారిని దూషించియున్నారు; కొందఱు పునర్వివాహ మాడిన స్త్రీల నందఱిని పునర్భువులనుగాఁ జెప్పి వారిని తక్కువవారినిగా చెప్పకయున్నారు. కొందఱు సామాన్యముగా పునర్భువులను దూషించిమాత్ర మున్నారు. ఇందుకు దృష్టాంతముగా మనువు తొమ్మిదవ యధ్యాయములో,—

శ్లో. యా౽౽ పత్యా వా పరిత్యక్తా విధవా వా స్వయేచ్ఛయా
ఉత్పాదయే త్పునర్భూత్వా స పౌనర్భవ ఉచ్యతే. ౧౭౫

పతిచేత విడిచిపెట్టఁబడినగాని విధవయయిగాని స్త్రీ స్వేచ్ఛ చేత ననఁగా శాస్త్రవిరుద్ధముగా బిడ్డను గన్నదానినే పునర్భువనియు, ఆ పుత్రుఁడే పౌనర్భవుఁడనియు నిర్వచించి యట్టివారిని మాత్రమే యపాంక్తేయులనుగాఁ జెప్పియున్నాఁడు. కాని విధి విహితముగా ద్వితీయ వివాహమాడిన దాని పుత్రుని పౌనర్భవునిగా నెక్కడను చెప్ప లేదు. అట్టి ద్వితీయ వివాహితపుత్రుఁడు మొదటి భర్తకు మాత్రమే పౌనర్భవుఁడగును గాని ద్వితీయభర్త కౌరసుఁడేయగును. "సహితం పుత్రమౌరస" మనియున్న భారతవచనమును జదివినచో నీయంశము స్పష్టమగును. ఇదేప్రకారముగా నా యా స్మృతులను ప్రత్యేకము

గాఁ జదివిన యెడల, పునర్భూవిషయమైయున్న మన ఋషుల యభిప్రాయము వారి వారికే తెలియును. ఏ స్మృతియైనను పునర్భూలక్షణమును సామాన్యముగాఁ జెప్పి వారిని దూషించినపక్షమున నక్కడ సమన్వయరీతిచేత విధియుక్తముగా పునరుద్వాహ మాడినవారి విషయములో తప్ప తక్కిన వారివిషయములో మాత్రమే యా దోషములు పట్టునని యర్థము చేయవలెను.

4. పూర్వోదాహృత మనుస్మృతి వచనములయందును, తదితర స్మృతివచనములయందును కొందఱు హవ్యకవ్యముల కనర్హులని దూషించుట యతిశయోక్తిచేత సాధారణముగా తదితరులు ప్రశస్తులని చూపుటకొఱకే గాని వానియం దంతకంటె విశేషమేమియు లేదు. అట్టిచోట్ల మన మెప్పుడును వాని యుద్దేశమునే గ్రహింపవలయును గాని యవయవార్థమును గ్రహింపరాదు. శబ్దార్థమునే గ్రహింత మనుపక్షమున, పయిని చెప్పఁబడిన మనువచనములను బట్టి వైద్యులును, వాణిజ్యము చేయువారును, గ్రామోద్యోగులును, రాజకీయోద్యోగస్థులును, పుప్పిగోళ్ళవారును, కప్పుపండ్లవారును, జ్యోతిష్కులును, చిలుకలు మొదలగు పక్షులను పెంచువారును, యాచకులును, వ్యవసాయము చేయువారును కూడ పంక్తిబాహ్యులే యగుదురు. అట్టివారి నెవ్వరు నిప్పుడు అపాంక్తేయులనుగాఁ జూడరు. కాఁబట్టి పయివాక్యములలో పయిని చెప్పఁబడినవారు కానివారు ప్రశస్తులని తాత్పర్యమే కాని వారందఱు నపాంక్తేయులని కాదు. ఒకవేళ పైదాని కవయవార్థము యంగీకరించి, వాదము నిమిత్తమై పునర్వివాహము చేసికొన్న వారిసుతులు పౌనర్భవులే యనియు వారు నిందిత పౌనర్భవులలోనే చేరుదురనియు నొప్పుకొన్నను, అప్పుడు సహితము వారు వైద్యులు, వర్తకులు, రాజకీయోద్యోగస్థులు, జ్యోతిష్కులు,

కృషిచేయువారు, మొదలయినవారితో సమానులే యగుదురు గాని వారికంటె తక్కువవారు కాఁజాలరు.

౫. పరాశరుఁడు "నష్టే మృతే" త్యాది వచనముచేత స్త్రీ పునర్వివాహమును విధించి పౌనర్భవపుత్రుని నెక్కడను చెప్పకపోవుట చేత కలియుగమునందు పునర్భూవ్యవహారముగాని పౌనర్భవ వ్యవహారముగాని బొత్తిగానే లేనట్టును, ద్వితీయవివాహితల పుత్రులు ఔరసులే యగుదురని పరాశర మతమైనట్టును స్పష్టమగుచున్నది.

శ్లో. ఔరసః క్షేత్రజ శ్చైవ దత్తః కృత్రిమకః సుతః
దద్యా న్మాతా పితావాపి సపుత్రో దత్తకః స్మృతః.

అని కలియుగమునందు త్రివిధపుత్రులను మాత్రమే పరాశరుఁడు చెప్పియున్నాఁడు. ఏవ పదసారస్యముచేత స్వక్షేత్రజుఁడనఁగా స్వభార్యయందు పుట్టినవాఁడే. యౌరసుఁడని పై శ్లోకములోని మొదటి పదమున కర్థము. ఈ యర్థమునే దత్తక మీమాంసయందు నంద పండితుఁడు వ్రాసియున్నాఁడు,—

ఔరసః క్షేత్రజశ్చైవ దత్తః కృత్రిమకస్సుతః-ఇతి కలిధర్మ ప్రస్తావే పరాశరస్మరణాత్, నచైవం క్షేత్రజోపిపుత్రః కలౌ స్యాదితి వాచ్యం-తత్రతపయోగః ప్రతిషేధేనైవ తన్నిషేధాత్ అస్తుతర్హి విహితప్రతిషిద్ధత్వాత్ వికల్ప ఇతిచేన్నదోషాప్త కాపత్తేః-కథం తర్హ్యత్ర క్షేత్రజగ్రహణ మితిచేత్ ఔరస విశేషణత్వేనేతి బ్రూమః- తథాచమనుః- శ్లో. స్వక్షేత్రే సంస్కృతాయాంతు స్వయ ముత్పాదితశ్చయః-తమౌరసం విజానీయాత్ పుత్రం ప్రథమకల్పితమ్. ఇతి— దత్తకమీమాంస.

ఈ పయిదానినిబట్టి పునర్వివాహము చేసికొన్న స్త్రీలు పునర్భువులును, వారిపుత్రులు పౌనర్భవులును కారనియు, వారెంతమా

త్రమును కులములో తక్కువవారు కారనియు, వారికిఁ బుట్టిన సుతు లౌరసులును, వారు సాధ్వులును నగుదు రనియు, కొంచె మాలోచించి చూచినయెడల నిష్పక్షపాతబుద్ధుల కందఱకును విశదము కావచ్చును. భారతమున పునర్వివాహిత యయిన యులూపి పుత్రుఁ డౌరసుఁడుగాను, ఉలూపి సాధ్విగాను జెప్పఁబడియుండుట యందఱకు విశదమయియే యుండును.—

శ్లో. ఆగతస్తు పున స్తత్ర గంగాద్వారం తయా సహ
పరిత్యజ్య గతా సాధ్వీ ఉలూపీ నిజమందిరమ్.

ఉ ప సం హా ర ము

ఇంతవఱకును స్త్రీపునర్వివాహము శాస్త్రసమ్మతమని చూపుటకయి ప్రయత్నించి నాకు తెలిసినదానిని సంగ్రహముగా తెలిపియున్నాను. ఇప్పుడవకాశము లేకపోవుటచేతను, గ్రంథవిస్తారము చేయుట నాయుద్దేశము కాదు గనుకను, నేను శ్రుతిస్మృతిపురాణములయందలి వచనముల నుదాహరించి వాని తాత్పర్యమును వ్రాసితినే కాని యర్థవిషయమయిన యాక్షేపసమాధానములను పూర్ణముగా వివరింపఁగలిగినవాఁడను గాను. కొంచెమాలోచించి చూచినయెడల నేను జెప్పిన యర్థములు క్లిష్టములు కావనియు శబ్దములవలన స్పష్టముగా కనఁబడునవియే యనియు మీకు విశదము కావచ్చును. ఈ విన్నదానినిబట్టి స్త్రీపునర్వివాము శాస్త్రసమ్మతమనియు, అవశ్యాచరణీయమనియు మీమనసునకయినను తోఁచవచ్చును. లోకానుభవమునుబట్టి చూచిన స్త్రీపునర్వివాహము కర్తవ్యమని తలఁపనివారెవ్వరుందురు? ఈ కాలమునందు మాత్రమే కాక పూర్వకాలమునందు సహితము స్త్రీలదురవస్థను జూచి మనసు కరఁగి విధవావివాహమును

పునరుద్ధారణము చేయుటకయి ప్రయత్నించిన పుణ్యపురుషు లనేకు లుండి యున్నారు. కొంచెమయినను దయారసముగలవా రీసత్కార్య విషయమున తగినతోడ్పాటును చేయకుండరని దృఢముగా విశ్వసించు చున్నాను. పెక్కువందల సంవత్సరముల క్రిందటనే మనదేశపు స్త్రీల దుర్దశలను మాన్పుటకయి జీర్ణమయిపోయిన నారీపునర్వివాహమును పునరుద్ధారణము చేయవలెనని జయపురమహారాజగు జస్వంతసిం గనువారును, సుప్రసిద్ధులయిన యప్పయదీక్షితులవారును ప్రయత్నము చేసినట్లు మనము వినుచుండుటయేకాని యాకాలమునందలి జనుల మౌఢ్యాధిక్యమునుబట్టి వారికోరికలు సఫలమయినట్లు వినలేదు. వంగదేశమునందు మూడువందలయేఁబది సంవత్సరముల క్రిందట పండితమండలాగ్రగణ్యుఁడుగా నుండిన స్మార్త భట్టాచార్య రఘు నందను లను వారొక గ్రంథమునుజేసి బాలవిధవ యయిన తన కొమార్తెకు వివాహము చేయవలెనని ప్రయత్నించిరి కాని చిరకాలాగతమయిన దురాచారప్రభావముచేత వారికోరికయు విఫలమే కావలసివచ్చినది. అటుతరువాత కొంతకాలమునకు రాజవల్లభుఁడను నతఁడు గొప్పప్రయత్నముచేసి పండితులచేత నొకవ్యవస్థ చేయించెను. గాని వివాహములనుమాత్రము చేయింపఁగలిగినవాఁడు కాఁడు. ఇప్పటి కించుమించుగ నూఱుసంవత్సరముల క్రిందట పీష్వావద్ద సేనాధిపత్యము వహించి ఘనతకెక్కిన పరశురామపట్ట బాహువర్ధనులనువారు తన కొమార్తెయగు దుర్గాభాయి యను నామె యెనిమిది సంవత్సరముల ప్రాయమున భర్తను పోఁగొట్టుకొన్నప్పు డామెకు పునర్వివాహము చేయుటకయి విశ్వప్రయత్నములు చేసిరి గాని తుదకప్పుడును కార్యము కాలేదు. అప్పుడు పునానగరమునం దుండు పండితులు మాత్రమే కాక కాశీపురమందలి పండితులును స్త్రీపునర్వివాహము

శాస్త్రసమ్మతమని సిద్ధాంతముఁ జేసిరి; అప్పటి శంకరాచార్యుల వారును దాని నంగీకరించిరి. అంతట వివాహము జరుగుటకు సిద్ధమయియుండఁగా బ్రాహ్మణులందఱును జేరి పరశురామపట్ట బాహువర్ధనుల భార్యపాదములమీఁద పడి ముట్టుపెట్టుకొని యీ మేమూలమున వివాహము జరుగకుండఁ జేసిరి. అటుపిమ్మట కొందఱు నాగపురము మొదలయిన స్థలములయందు కొంతప్రయత్నము చేసిరి కాని వారిప్రయత్నములు ఉపన్యాసములతోనే సరిపోయినవి. తరువాత మొట్టమొదట మన హిందూదేశములో స్త్రీ పునర్వివాహములను సరిగా జరిపించిన వారు గొప్పపండితులయి కాలీఘట్ట రాజధానియందు వసియించెడి పండిత ఈశ్వరచంద్ర విద్యాసాగరు లనువారు. వారు బహుప్రయాసపడి జనులకు శాస్త్రమును జూపి వారి కన్నులను విప్పుటయే కాక స్త్రీపునరుద్వాహవిషయమయి రాజకీయశాసనము నొకదానిని కలిగించి ౧౮౫౬ వ సంవత్సరములో మొట్టమొదట రెండువివాహములను జరిగించిరి. నాటినుండి బంగాళారాజధానియందు పెక్కు వివాహములు జరుగుచునేయున్నవి. తరువాత బొంబయి నగరమునందు విష్ణుపరశురామశాస్త్రిలవారు ౧౮౬౭ వ సంవత్సరమునందు వాదమునకారంభించి ౧౮౭౦ వ సంవత్సరమున సరిగా కొన్నివివాహములను జరిగించిరి. ఇప్పుడా శాస్త్రిలవారు మృతులయినను, ఆ ప్రాంతములయందు పునరుద్వాహములు విస్తారముగా జరుగుచు వచ్చుచున్నవనుమాట వార్తాపత్రికలను జదువువారి కందఱికిని తెలిసియుండును. ఎక్కడ నేవిధముగా జరుగుచున్నను మన రాజధానిమాత్రము నేటివఱకును కన్నులు మూసికొని హాయిగా నిద్రపోవుచున్నది. ఈ పట్టణమున పదునెనిమిది సంవత్సరములనుండి ఒకసమాజమున్నను చేసినపని యేమియుఁ గానరాదు. నేను ౧౮౭౯ వ సంవత్సరమునందు రాజ

మహేంద్రవరమున నీవిషయమున నుపన్యాసములను జేయనారంభించి, భగవదనుగ్రహమువలన నిప్పటికి రెండువివాహములను జేయింపఁ గలిగినాఁడను. ఈ రాజధానివారిఁకనైన నిద్రనుండి లేచి చురుకుగా పనిచేసి తక్కిన రాజధానులవారితో సామ్యమును పొంద ప్రయత్నింతురని కోరుచున్నాను. సర్వదయాపరుఁడయిన యీశ్వరుఁడే యీ విషయమున మీకు ధైర్యస్థైర్యముల నిచ్చునుగాక యని ప్రార్థించుచు, ఈ యుపన్యాసమును యింతటితో ముగించుచున్నాను.
